RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com



# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 250 వెల - రూ 5:00
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

ఆదివారం 15, జనవరి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటనకర్తలకు, విలేకరులకు, కుటుంబ సభ్యులకు,

**సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు**

- ఎడిటర్



## పాత ఆలోచనలకు పాతర కొత్త ఆలోచలనతో సాగుదాం..

- భోగి మంటలు వేసిన ఎమ్మెల్సీ కవిత
- భారత జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



**హైదరాబాద్,జనవరి14(ప్రజామంటలు):** పాత ఆలోచనలు భోగి మంటల్లో వేసి.. కొత్త ఆలోచనలకు నాంది పలకడం భోగిపండుగ ఉద్దేశమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను అందరం ఘనంగా జరుపుకుంటామన్నారు. హైదరాబాద్‌లో కూడా సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని

మిగతా... 2లో

## తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలి

- కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌కు కెటిఆర్ లేఖ



**హైదరాబాద్,జనవరి14(ప్రజామంటలు):** పారిశ్రామిక పురోగతికి కేంద్రం సహకరించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ లేఖ రాశారు. తెలంగాణ వంటి రాష్ట్రాలకు సహకరిస్తే దేశానికి సహకరించినట్లే అని పేర్కొన్నారు. ఎనిమిదేండ్లలో దేశ పారిశ్రామిక రంగంలో తెలంగాణ కీలకం అని చెప్పారు. తెలంగాణ పారిశ్రామిక ప్రాజెక్టులకు జాతీయ ప్రాధాన్యత ఉందన్నారు. జహీరాబాద్ నిమ్జ్‌లో

మిగతా... 2లో

## వైవిధ్యానికి ప్రతీక సంక్రాంతి

- సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని



**న్యూఢిల్లీ,జనవరి14(ప్రజామంటలు):** మకర సంక్రాంతి, మాగ్ బిహు, ఉత్తరాయన్, పొంగల్, భోగీని పురస్కరించుకుని దేశ పౌరులకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలు భారతదేశ శక్తిమంతమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని సూచిస్తాయని మోదీ పేర్కొన్నారు. మకర సంక్రాంతి, మాగ్ బిహు, ఉత్తరాయన్, పొంగల్, భోగి సందర్భంగా మీ అందరికీ శుభాకాంక్షలు. ప్రకృతి ఆరాధనతో ముడిపడి ఉన్న ఈ పండుగలు ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలు, ఆరోగ్యం, ఆనందాన్ని తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను అని పేర్కొన్నారు.'సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భోగి పండుగ సందర్భంగా సకల జనులకు ఆ భగవంతుడు భోగభాగ్యాలు, సుఖసంతోషాలు కలిగించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. ప్రజలకు భోగి శుభాకాంక్షలు అని ఏపి గవర్నర్ బిశ్వభూషన్ తెలిపారు. ప్రతికూల ఆలోచనలు వదిలి, సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవాలనే సందేశాన్నిచ్చే ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లోకి నూతన కాంతులను తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.

## ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



- సిఎం కెసిఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్,జనవరి14(ప్రజామంటలు): దేశ,రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతిని ప్రజలంతా సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని కోరారు. ప్రతి ఇల్లు సిరిసంపదల తో నిండాలన్నారు. ఒకప్పుడు సాగు దండగ అన్న తెలంగాణలో నేడు పండగ అయ్యిందని తెలిపారు. వ్యవసాయ ప్రగతిలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పులు తీసుకరావాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయం పండగ అయినప్పుడే అసలైన సంక్రాంతి అని అన్నారు.

# పట్నం... పల్లెటూరు

- బస్టాండ్లలో తప్పని పడిగాపులు
- సొంతూర్లకు వెళ్లాలనుకున్న వారికి భంగపాటు
- ఉదయమే వచ్చినా కిక్కిరిసిన బస్సులు
- హైదరాబాద్‌లో బోసిపోయిన రోడ్లు
- జనం పల్లెలకు వెళ్లడంతో తగ్గిన సందడి
- రెండు రోజుల్లో సిటీ దాటిన లక్షా 20 వేల వాహనాలు



**హైదరాబాద్,జనవరి14(ప్రజామంటలు):** సంక్రాంతి సెలవుల సందర్భంగా నగరంలోని చాలా మంది సొంతూళ్లకు వెళ్లడంతో రెండురోజులుగా నగరం బోసిపోయింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ వినియోగమూ తగ్గిందని అంచనా. ఇక.. మెట్రో రైళ్లలోనూ ప్రయాణికుల రద్దీ రెండు రోజులుగా భారీగా తగ్గింది. పండుగకు ఊరెళ్లే వాహనాలన్నీ సాఫీ ప్రయాణం కోసం ఔటర్ రింగ్ రోడ్డును ఎంచుకుంటుండడంతో గత నాలుగైదు రోజులుగా ఓఆర్ఆర్‌పై మాత్రం వాహనాల సంఖ్య బాగా పెరిగింది. ఐదు రోజుల్లో పదిలక్షల వాహనాలు ఔటర్‌పై అదనంగా ప్రయాణం చేసినట్టు సమాచారం. ఇకపోతే నగర రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు కానరావడం లేదు. వాహనాల రొద బాగా తగ్గింది. సాధారణంగా నగర రోడ్లపై ప్రతి రోజూ సగటున 50 లక్షల వాహనాలు తిరుగుతుంటాయి. శుక్ర, శనివారాల్లో 20 లక్షల లోపే ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ తగ్గిపోవడంతో వాహనదారులు వేగంగా గమ్యస్థానాలకు చేరుకోగలుగుతున్నారు. రాష్ట్ర రాజధాని నగరంలో.. రహదారులపై ట్రాఫిక్ తగ్గింది! ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వాహనాల మోతతో దద్దరిల్లే రహదారులు బోసిబోయి కనిపిస్తున్నాయి. లాక్‌డౌన్ పెట్టినట్టుగా.. పలు కాలనీలు నిర్మానుష్యంగా మారాయి. రోడ్ల వెంట తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు గిరాకీ కోసం పడిగాపులు కాసారు. నాలుగు రోజుల క్రితం వరకూ.. ఐటీ కారిడార్‌లోని రోడ్లపై నిమిషానికి వేలాది వాహనాలు రాకపోకలు సాగించిన పరిస్థితి ఉండగా.. పదుల సంఖ్యలోనే కనిపించాయి. నగరంలోని రహదారులపై రద్దీ తగ్గినా.. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు మాత్రం కిటకిటలాడాయి. అటు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపైనా రద్దీ కొనసాగుతోంది. పంతంగి టోల్‌గేటు వద్ద విపరీత మైన వాహనాల రద్దీ నెలకొంది. దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటుచేసిన ప్రత్యేక రైళ్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పండక్కి సొంతూరికి వెళ్లాలన్న నగరవాసుల కోరికను ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రైవేటు బస్సుల్లో చార్జీలను సాధారణ రోజుల్లో కంటే 40 నుంచి 50 శాతం మేర పెంచేయడంతో సామాన్య, మధ్య తరగతి ప్రయాణికుల జేబులు గుల్ల అయ్యాయి. ప్రత్యేక రైళ్లు, బస్సులు ఇప్పటికే నిండిపోవడంతో వేరేమార్గం లేక వాటిలో ప్రయాణిస్తున్నారు.

**బస్టాండ్లలో తప్పని పడిగాపులు**

సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లాలన్న ప్రజలకు బస్సులు దొరక్క చాలామంది నానాయాతన పడ్డారు. శనివారం ఉదయం కూడా బస్సుల కోసం వేకువ జామునుంచే బస్టాండ్ల వద్దకు వచ్చినా చేరాల్సిన గమ్యానికి బస్సులు దొరక్క ఇబ్బందులు పడ్డారు. తమ స్వగ్రామాలకు తరలివెళ్తున్న ప్రయాణికుల రాకతో జూబ్లీ బస్‌స్టేషన్,ఇమ్లిబన్, దిల్‌సుఖ్ నగర్,ఉప్పల్ బస్టాండ్ పరిసరాలు కిటకిట లాడాయి. నగరవాసులు కుటుంబ సమేతంగా పండుగకు తమ ఊళ్లకు

మిగతా... 2లో



## ఇళ్లముందు ముగ్గుల వేడుకలతో పల్లెక్రాంతి

- జంటనగరాల్లో భోగిమంటలు వేసిన ప్రజలు
- పోటీపడి ముగ్గులేసిన ఆడపడుచులు

**హైదరాబాద్,జనవరి14(ప్రజామంటలు):** జంటనగరాల్లోనూ సంక్రాంతి సందడి కనిపించింది. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. గ్రామాలకు వెళ్లినవారు వెళ్లగా హైదరాబాద్‌లో ఉన్న వారు పండగ వేడుకల్లో పాల్గొన్నన్నారు. భోగి మంటలకు పిడకలు, గొబ్బెమ్మలకు కూడా అంతారెడీమేడ్ వ్యవహారాలే నడిచాయి. హరిదాసుల పాటలు. గంగిరెద్దుల ఆటలు.. సంప్రదాయ వస్త్రధారణతో మెరిసిపోతున్న చిన్నారులతో సంక్రాంతి ముందుగానే వచ్చినట్టుంది. శిల్పారమంలో భోగిమంటలు ఆకట్టుకున్నాయి. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే వారు ఒక్కచోటకు చేరి రంగ వల్లికలు తీర్చిదిద్దారు. ఉదయమే పలుకాలనీల్లో భోగిపమంటలు వేశారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు అందంగా దర్శనమిచ్చాయి. లోగిళ్ల ముందు ముత్యాల ముగ్గులు పలుకరించాయి.ఇప్పటికే చాలా మంది నగరవాసులు సొంతూళ్లలో బంధువులతో కలిసి పండుగ చేసుకునేందుకు పల్లెబాట పట్టారు. ఇక్కడే ఉన్నవారు చుట్టుపక్కల కుటుంబాలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటున్నారు. రెండు మూడు రోజులుగా ప్రతి ముంగిటా పండుగ వాతావరణం కనిపిస్తోంది. ముంగిళ్లలో తీర్చిదిద్దిన రంగవల్లికలు.. ముచ్చటగా కనిపించే గొబ్బెమ్మలతో చాలా ముందుగానే సంక్రాంతి వచ్చిందా అనిపించింది. సంక్రాంతి... పది రోజులు ముందుగానే.. పల్లెల్లో పండుగ మొదలవుతుంది. ఉదయం,

మిగతా... 2లో

## కర్ణాటకలో బీజేపీకి పరాభవమే

**మోదీ, షాపై కుమారస్వామి విసుర్లు**

**బెంగళూరు:** 'ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వంద సార్లు కర్ణాటకలో పర్యటించి ప్రచారం చేసినా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదు. మళ్లీ రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోలేద'ని జేడీఎస్



అగ్రనేత, మాజీ సీఎం కుమార స్వామి పేర్కొన్నారు. శనివారం ఆయన మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతూ బీజేపీ అసమర్థ, అవినీతి పాలనతో ప్రజలు విసిగి వేసారిపోయారని వ్యాఖ్యానించారు. జేడీఎస్‌కు పట్టున్న పాత మైసూరు ప్రాంతంలో పాగా వేసేందుకు హోంమంత్రి అమిత్ షా మండ్యలో పర్యటించటం గురించి మాట్లాడుతూ.. మండ్యకు అమిత్ షా వచ్చి పోయినంత మాత్రాన బీజేపీకి ఒరిగేదేమీ ఉండదని అన్నారు. మండ్య జిల్లాలోని ఏడుకు ఏడు నియోజక వర్గాల్లో జేడీఎస్ అభ్యర్థులే గెలుస్తారని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేసారు. 'విద్యుత్తు కొరత, గుంటలు పడిన రోడ్డు, నీళ్లు రాని నల్లాలు, డ్రైనేజీల గురించి కాకుండా లవ్ జిహాద్ గురించి మాట్లాడండి, దానికి వ్యతిరేకంగా పోరాడండి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళిని కుమార్ కటీల్ పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వటం సిగ్గుచేటు' అని వ్యాఖ్యానించారు.

## గడ్కరీని చంపేస్తాం

**కేంద్ర మంత్రి కార్యాలయానికి బెదిరింపు**



**నాగ్‌పూర్:** కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కార్యాలయానికి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి ఆయనను చంపుతానంటూ బెదిరించాడు. అంతర్జాతీయ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడిగా పేర్కొన్న ఆ వ్యక్తి తనకు

మిగతా... 2లో

## దేశ గౌరవాన్ని తగ్గించకండి

- పాక్, శ్రీలంకతో భారత్‌కు పోలికా?
- సైనికుల ఖ్యాతిని కించపరచొద్దు
- మత విద్వేషాలను రెచ్చగొట్టకండి
- సీఎం కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి హితవు


**హైదరాబాద్, జనవరి 14:** దేశ ప్రతిష్ఠ, గౌరవాన్ని తగ్గించేలా మాట్లాడటం సీఎం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఏమాత్రం ఇంగిత జ్ఞానం ఉన్నా.. గడిచిన ఎనిమిదేళ్లలో దేశంలో ఐఎసఐ కార్యకలాపాలు, మత కలహాలు ఎలా తగ్గిపోయాయో గమనించాలన్నారు. "దేశ సైనికుల గొప్పదనాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు



చేస్తారు. పటిష్ఠమైన మన ఆర్థిక వ్యవస్థను పాకిస్థాన్, శ్రీలంకతో పోలుస్తారు. ఇప్పుడు అఫ్గానిస్తాన్ అంటారు.. ఇదేం పద్ధతి..?

మిగతా... 2లో

## ప్రజానాడి




## వచ్చే ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ మరో యాత్ర

- 26 నుంచి సాత్ సే హాత్ జోడో యాత్రకు శ్రీకారం
- వివరాలు వెల్లడించిన కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ,జనవరి14(ప్రజామంటలు):** జోడో యాత్ర' ముగియకముందే.. కాంగ్రెస్ పార్టీ మరో యాత్ర చేపట్టనుంది. 2024 ఎన్నికల లక్ష్యంగా కాంగ్రెస్ 'సాత్ సే హాత్ జోడో' అనే మరో యాత్ర ప్రారంభించనుంది. ఈ యాత్ర జనవరి 26 రిపబ్లిక్ డే నుండి ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ వెల్లడించింది. ఈ సందర్భంగా శనివారం కాంగ్రెస్ సీనియర్ నేత జైం రమేశ్ మీడియాతో మాట్లాడుతూ.. 'రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్రకు కొనసాగింపుగానే ఈ సాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగనుంది. జోడో యాత్రలో 2024 ఎన్నికల లక్ష్యమనే సందేశం ప్రజలకు చేరువ కాలేదు. జోడో యాత్రలో బహుళ వర్గాల నుండి వచ్చిన అభిప్రాయలకనుగుణంగా ఈ యాత్రను ప్రారంభించడం జరిగిందని అన్నారు. అలాగే సాత్ సే హాత్ జోడో యాత్ర మూడు అంచెల ప్రచారం జరగనుందని ఆయన తెలిపారు. మొదట రాష్ట్ర రాజధానుల్లో మహిళల భాగస్వామ్యంతో పాద యాత్రలు, సమావేశాలు, ర్యాలీలు జరగనున్నాయి. ఆ తర్వాత రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఇంటింటి ప్రచారం జరగనుందని

మిగతా... 2లో

# వందే భారత్‌కు పట్టాభిషేకం

- సికింద్రాబాద్ స్టేషన్‌లో నేడే వందే భారత్ ప్రారంభం
- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న మోదీ
- రేపటి నుంచి అందుబాటులోకి రెగ్యులర్ సర్వీసులు
- వారంలో ఆరు రోజులే పరుగులు.. ఆదివారం సెలవు
- టికెట్ ధరలు ఖరారు చేసిన రైల్వే శాఖ
- చైర్‌కార్ రూ.1665, ఎగ్జిక్యూటివ్ క్లాస్ 3120
- వెళ్లేటప్పుడు ఓ రేటు.. వచ్చేటప్పుడు మరొక రేటు
- వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రిలో హాల్ట్
- కేసీఆర్‌కు ఆహ్వానం పంపించాం: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్/విశాఖపట్నం, జనవరి 14:** తెలుగు రాష్ట్రాల ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న హైస్పీడ్ రైలు 'వందేభారత్' ఆదివారం ప్రారంభం కానుంది. సోమవారం (ఈ నెల 16) నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. దేశంలోని వివిధ మార్గాల్లో ఇప్పటికే ఏడు వందేభారత్ రైళ్లు నడుస్తుండగా.. ఎనిమిదో రైలును దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రబిందువైన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభించనున్నారు. ఈ రైలును సంక్రాంతి పర్వదినం శుభ సందర్భంగా ఆదివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి రైల్వే అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ నెంబర్ ప్లాట్‌ఫారం (బోయిగూడ వైపు)పై ఈ రైలు ప్రారంభోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, అశ్విన్ వైష్ణవ్ తదితరులు పాల్గొననున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు రైలు రాకపోకలు సాగిస్తుందని, ప్రతి



ఆదివారం అందుబాటులో ఉండదని అధికారులు పేర్కొన్నారు. కాగా, దక్షిణ మధ్య రైల్వేలో హైస్పీడ్ రైలుగా తొలిసారిగా పట్టాలెక్కుతున్న 'వందేభారత్' రైలు టికెట్ రేట్లను అధికారులు శనివారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు.

విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలుకు 20833 నంబర్, సికింద్రాబాద్ నుంచి

మిగతా... 2లో

### తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి
# సహకరించాలి

మొదటి పేజీ తరువాయి..

మౌలిక సదుపాయాల కల్పన కోసం, హైదరాబాద్ వరంగల్ పారిశ్రామిక కారిడార్‌కు కూడా నిధులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ? నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు ఆర్థిక సాయం చేయాలన్నారు. హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలన్నారు. జడ్చర్ల పారిశ్రామిక పార్కులో ఉమ్మడి వ్యర్థాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. బ్రౌన్ ఫీల్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు మంజూరు, అప్‌గ్రేడేషన్ చేయాలన్నారు. ఆదిలాబాద్ సీసీఐ యూనిట్‌ను పునరుద్ధరించాలని సూచించారు. హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ ఫార్మాసిటీకి బ్జడెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. చేనేత రంగానికి జీఎస్టీ మినహాయించాలని సూచించారు. ఐటీఐఆర్ లేదా సమాన ప్రాజెక్టు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ఎనిమిదేండ్లుగా కేంద్రానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని కేటీఆర్ తెలిపారు.

# దేశ గౌరవాన్ని తగ్గించకండి

మొదటి పేజీ తరువాయి..

ప్రధాని మోదీని విమర్శించండి. కానీ దేశ గౌరవాన్ని తగ్గించవద్దు..” అని కేసీఆర్‌కు హితవు పలికారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఇలాగే మత విద్వేషాలను రెచ్చగొడితే దేశం అఫ్గానిస్తాన్‌లా మారినా ఆశ్చర్యం లేదన్నారు. తాను తండ్రిని అడ్డుపెట్టుకుని మంత్రిని కాలేదని మంత్రి కేటీఆర్‌నుద్దేశించి కిషన్‌రెడ్డి విమర్శించారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా, కష్టపడి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. “విద్యావంతుడు.. కాస్త ఆలోచించి మాట్లాడతారని కేటీఆర్ గురించి తెలంగాణ సమాజం అనుకుంది.. కానీ, ఆయన తండ్రి కంటే దిగజారి మాట్లాడు



తున్నారు. సూర్యుడిపై ఉమ్మివేసినట్లుగా ప్రధాని మోదీని విమర్శిస్తున్నారు” అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రం, తెలంగాణకు ఇచ్చిన నిధులపై వివరాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, రాజీనామా లేఖతో రావాలని బండి సంజయ్ సవాల్ చేసినా.. సీఎం కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ అంశంపై మిడిమిడి జ్ఞానంతో మాట్లాడే కేటీఆర్ లాంటివారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

**కేసీఆర్‌కు ఆహ్వానం పంపించాం..**

సికింద్రాబాద్‌లో ఆదివారం జరిగే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపించామని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి కానుకగా, వందే భారత్ ఎక్స్‌ప్రెసను ప్రధాని మోదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇది ఆరో రైలు అని.. దేశవ్యాప్తంగా ఇలాంటి వంద రైళ్లను ప్రారంభించాలన్నదే లక్ష్యమని చెప్పారు. దీని షెడ్యూల్‌ను రైల్వే మంత్రి ఆదివారం ప్రకటిస్తారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో 10 లక్షల ఉద్యోగాల భర్తీలో భాగంగా మూడో దఫా అపాయింట్‌మెంట్ లెటర్లను ఈ నెల 20న ప్రధాని వర్చువల్‌గా.. తాను, కేంద్ర మంత్రి కౌశల్ కిషోర్ హైదరాబాద్‌లో నేరుగా అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో టీబీ నిర్మూలనకు కేంద్రం రూ.146కోట్లు ఇచ్చిందని చెప్పారు. తాను కూడా ఒక టీబీ రోగిని దత్తత తీసుకున్నానని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికీ ఆయుష్మాన్ భారత్‌ను పూర్తిగా అమలుచేయకపోవడం విచారకరమని అన్నారు. మలక్‌పేట ఆస్పత్రి ఘటన దురదృష్టకరమన్నారు.

### వచ్చే ఎన్నికలే లక్ష్యంగా
# కాంగ్రెస్ మరో యాత్ర

మొదటి పేజీ తరువాయి..

రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన జోడో యాత్రలో రాహుల్ తెలుసుకున్న ప్రజా సమస్యలు, బిజెపి వైఫల్యాలపై రెండు కరపత్రాలను విడుదల చేశారు.కాగా, జోడో యాత్రలో తెలుసుకున్న ప్రజా సమస్యలపై రాహుల్ కాంగ్రెస్ కమిటీలకు బహిరంగ లేఖ రాశారు. రాహుల్ గాంధీ రాసిన లేఖలో 'ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ధరల పెరుగుదల వంటి విషయాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఇక బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లపరం చేస్తుందనీ.. ఇది దేశవ్యాప్తంగా నిస్సహాయతకు నిదర్శనంగా నిలుస్తుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. రాహుల్ లేఖ ఆధారంగానే 'సాత్ సే హాత్ జోడో' యాత్ర కార్యాచరణ ఉండనుంది. ఈ యాత్రకు సన్నద్ధం కావాలని కాంగ్రెస్ కమిటీలకు ఇప్పటికే సూచించడం జరిగిందని రమేష్ తెలిపారు. కొత్తగా చేపట్టబోయే ప్రచారం యాత్ర 2.5 లక్షల గ్రామ పంచాయతీలు, ఆరు లక్షల గ్రామాలు, 10 లక్షల బూత్‌లకు చేరుకుంటుందని రమేష్ పేర్కొన్నారు.

# గడ్కరీని చంపేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రూ.వంద కోట్లు ఇవ్వకపోతే ఆయన కార్యాలయాన్ని కూడా పేల్చివేస్తానని హెచ్చరించాడు. నాగ్‌పూర్ ఖమ్లాలో ఉన్న గడ్కరీ కార్యాలయంలోని ల్యాండ్‌లైన్ ఫోన్‌కు శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో మూడు బెదిరింపు కాల్స్ వచ్చాయని సీపీ అమితేశ్ కుమార్ తెలిపారు. గడ్కరీ కార్యాలయానికి, ఆయన నివాసానికి మధ్య కిలోమీటర్ దూరం మాత్రమే ఉంది. బెదిరింపు కాల్స్‌తో అప్రమత్తమై ఆయన భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని సీపీ వెల్లడించారు.

# ఇళ్లముందు ముగ్గుల వేడుకలతో పల్లెక్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం.. ఇంటిముందు కళ్లాపి చల్లి... అందమైన ముగ్గులు వేస్తారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు చేస్తారు. పూలు, పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. గ్రామాల్లో ఆవులు, గేదెలు ఉంటాయి కాబట్టి పేడకు కొదవ ఉండదు. సిటీలో పేడరంగు లాంటి పౌడర్‌తో కల్లాపి చల్లి రంగవల్లులు వేశారు. సంక్రాంతి శుభాకాంక్షల అందులో మెరిశాయి. పిల్లలకు భోగిపండ్లు పోస్తూ సంబరాలు చేసుకున్నారు. పలు పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు వేడుకల ఏర్పాటు చేసారు. వేషధారణలు, ముత్యాల ముగ్గుల పోటీలు పెడుతున్నారు. సంప్రదాయ పిండివంటలను రుచి చూపుతున్నారు. తెల్లవారుజామునే.. భోగిమంటలు వేసి.. కొత్త సరదాలను ఆస్వాదించారు. ఇక సంప్రదాయ పిండివంటలు చేసి అమ్మే షాపులు కిటకిటలాడాయి. చేతి వంటలను చెంతకు చేర్చే ఎన్నో షాపులు నగరవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. పండుగ సందర్భంగా నగరంలోని కొన్ని హోటళ్ల నిర్వాహకులు సంక్రాంతి ప్రత్యేక ఆహారోత్స వాలు నిర్వహిస్తున్నారు. పులిహోర, నాటుకోడికూర, పప్పుచారు, అరిసెలు, బందరు లడ్డు, బూందీ లడ్డు, పెరుగు ఆవడలను అందిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి విందు ఆరగించేందుకు రమ్మంటూ ఆహ్వానిస్తున్నారు. అరిసెలు, బొబ్బట్లు, కజ్జికాయలు, జంతికలు, గవ్వలు, చెక్కలు, సున్నుండలు, పూతరేకులను ప్రత్యేక ఆఫర్లతో అందిస్తున్నారు.వ్యాపార కార్యకలాపాల్లో మునిగి తేలుతున్నారు.





### పాత ఆలోచనలకు పాతర
# కొత్త ఆలోచలనతో సాగుదాం..

మొదటి పేజీ తరువాయి..

కేబీఆర్ పార్కు వద్ద భారత్ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనలోని ప్రతికూలతలను విడిచిపెట్టి నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్దామన్నారు. తెలంగాణ జాగృతి నుంచి భారత్ జాగృతిగా రూపాంతరం చెందాక మొదటి సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. పల్ లెవాతావరణాన్ని నగరానికి తీసుకొచ్చిన హైదరాబాద్ జాగృతివారిని అభినందించారు. కాగా, భోగి వేడుకల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు, గంగిరెద్దుల ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే నిన్నటి దాక తెలంగాణ అస్తిత్వం, సాంప్రదాయంపై గొంతెత్తిన ఎమ్మెల్సీ కవిత అనూహ్యంగా స్వరం మార్చారు. తెలుగు సంస్కృతి అంటూ కొత్త రాగం అందుకున్నారు. టీఆర్ఎస్.. బీఆర్ఎస్ గా మారడం.. పక్క రాష్ట్రమైన ఏపీలో కూడా ఆ పార్టీ విస్తరించాలని చూస్తున్న క్రమంలో ఆమె తెలుగు సంస్కృతి గురించి మాట్లాడడం విశేషం. దీంతో కవిత మాటల్లో మార్పు వచ్చింది. సంక్రాంతి తెలుగు ప్రజలకు పెద్ద పండుగ అంటూ ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. హైదరాబాద్ లోని కేబీఆర్ పార్కు వద్ద భారత జాగృతి ఆధ్వర్యంలో భోగి వేడుకల్లో నిర్వహించారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శన, ఒగ్గు కళాకారుల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవిత.. బోగీ మంటలను వెలిగించారు. అనంతరం మాట్లాడిన ఆమె.. తెలంగాణ జాగృతి.. భారత జాగృతిగా మారిన తరువాత మొదట కార్యక్రమంగా సంక్రాంతి లాంటి పెద్ద పండుగ రావడం గర్వకారణమన్నారు. సంక్రాంతి అంటేనే సంస్కృతి, సంప్రదాయాలకు నిలువటద్ధమని చెప్పారు. పాత ఆలోచనలను బోగి మంటలలో వేసి కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

# పట్నం... పల్లెటూరు



మొదటి పేజీ తరువాయి..

వెళ్తుండడంతో సందడి వాతావరణం నెలకొంది. అధికారులు ముందుగా అనుకున్నట్లుగానే రద్దీకి అనుగుణంగా కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ సెక్టార్లలోని వివిధ ప్రాంతాలకు రోజువారి సర్వీసులతోపాటు అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ వైపు ప్రత్యేక బస్సులు నడిపారు. కర్నూలు రూట్లో కూడా బస్సులు నడిపారు.సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీతో ఎంజీబీఎస్, సీబీఎస్‌లు కిటకిటలాడుడాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆర్టీసీ రెగ్యులర్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సు సర్వీసుల్ని ఏర్పాటు చేసింది. అన్ని బస్సులు ఎంజీబీఎస్ నుంచే నడపడం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో ఆర్టీసీ అధికారులు గత కొన్నేళ్లుగా ఎంజీబీఎస్‌తో పాటు జేబీఎస్, నగర శివారు ప్రాంతాలైన దిల్‌సుఖ్‌నగర్, ఎల్.బి.నగర్, ఉప్పల్, ఈసీఐఎల్, ఆరాంఘర్, మెహిదీపట్నంలతో పాటు ఆర్టీసీ అధీకృత ఏజెంట్లకు కేటాయించిన ప్రాంతాల వద్ద నుంచి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.ప్రయాణికుల రద్దీతో ఎంజీబీఎస్, సీబీఎస్‌లు కిక్కిరిసిపోయాయి. ఆంధ్రదేశ్‌లోని కొన్ని జిల్లాలకు కాచిగూడతో పాటు సీబీఎస్ హ్యాంగర్‌లనుంచి బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ సందర్భంగా రోజువారీ సర్వీసులతోపాటు వివిధ ప్రాంతాలకు అదనంగా సర్వీసులను నడిపించా మని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం నుంచి కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉందని, రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేసేందుకు సిద్ధగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**రెండు రోజుల్లో సిటీ దాటిన లక్షా 20 వేల వాహనాలు**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో పట్నంవాసులు పలలెబాటపట్టారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజాకి వాహనాల తాకిడీ భారీగా పెరిగింది. రెండు రోజుల్లోనే లక్షా 20 వేలకు పైగా వాహనాలు టోల్‌గేట్ దాటాయి. గురు, శుక్రవారాల్లో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 1 గంటల వరకు పంతంగి, బీబీనరగ్ టోల్‌ప్లాజా మీదుగా పయణించిన వాహనాల సంఖ్యను రాచకొండ ట్రాఫిక్ పోలీసులు విడుదల చేశారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న పంతంగి టోల్‌ఎ÷–లాజా వద్ద ఈ నెల 12న మొత్తం 56,595 వాహనాలు పాస్‌అయ్యాయి. ఇందులో 42,844 కార్లు ఉండగా 1,300 ఆర్టీసీ బస్సులు, 4,913 ప్రైవేట్ బస్సులు, 7,538 గూడ్స్, ఇతర వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఇక శుక్రవారం రాత్రి (13/01/2023) మొత్తం 67,577 వాహనాలు టోల్‌ప్లాజా మీదుగా పయణించాయని చెప్పారు. ఇందులో 53,561 కార్లు, 1,851 ఆర్టీసీ బస్సులు, 4,906 ప్రైవేట్ బస్సులు, 7,259 ఇతర వాహనాలు ఉన్నాయి. కాగా, హైదరాబాద్–వరంగల్ హైవేపై ఉన్న బీబీనగర్ టోల్‌గేట్ మీదుగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 1 గంటవరకు మొత్తం 25231 వాహనాలు పయణించాయని తెలిపారు. ఇందులో 17844 కార్లు, 872 బస్సులు, వరంగల్ వైపు నుంచి హైదరాబాద్‌కు మొత్తం 13,334 వాహనాలు వెళ్లాయని చెప్పారు.

# తెలుగు లోగిళ్లలో ఘనంగా భోగి

### సంబరంగా భోగిమంటలు వేసిన ప్రజలు

### జిల్లాల్లో సైతం భోగిమంటల వేడుకలు

**హైదరాబాద్,జనవరి14(ప్రజామంటలు):** తెలుగు ప్రజలు ఘనంగా భోగి సంబరాలు చేసుకున్నారు. గవర్నర్ తమిళిసై ప్రజలందరికీ పొంగల్ అభినందనలు తెలిపారు. తెలువారందరి ముఖ్యమైన పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఈ సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వెళ్లిన వారందరూ ఇంటికి చేరుకొని బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. అయితే భోగి, మకర సంక్రాంతి, కనుమగా ఇలా మూడు రోజులు పండుగను అత్యంత వైభవోపేతంగా తెలుగువారందరూ జరుపుకుంటారు. భోగి పండుగను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల్లో( వేకువజామునే భోగి మంటలు వేశారు. దీంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పండుగ శోభను సంతరించుకుంది. వీధుల్లో రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటల దగ్గర పిల్లలు, పెద్దల కేరింతలు వేస్తూ ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. భోగి మంటల వద్ద చిన్నారులు కోలాటలతో ఆడిపాడారు. హరిదాసుల కీర్తనలతో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు భోగి పండగను ఘనంగా జరుపుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచే భోగి మంటలతో ఇళ్ల ముందు విభిన్న రంగులతో రంగవల్లులు వేస్తూ చిన్నా పెద్దా సందడి చేశారు. భోగి పండుగతో భోగభాగ్యాలు కలగాలని... ఏడాది అంతా సుఖశాంతులతో ఉండాలని కోరుతూ భోగిమంటలు వేశారు. హైదరాబాద్‌లోని పలు కాలనీలు, కమ్యూనిటీల్లో తెల్లవారుజాము నుంచే ఇంటి ముందు ఆడపడుచులు ముగ్గులు వేసుకొని భోగి సంబరాలు చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల వేకువజాము నుంచే భోగి మంటల సందడి మొదలైంది. ఇంటి ముంగిట రంగవల్లులు పెట్టి... భోగిమంటల మధ్య పెద్దలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో గడిపారు. ఖమ్మంలో మంత్రి హరీష్ రావు భోగిమంటలు వేశారు. భోగి వేడుకలు నిర్వహించారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజామునే లేచి వాకిట్లో రంగు, రంగుల ముగ్గులు వేసి.. ఆవు పేడతో గొబ్బెమ్మలను వాకిట్లో పేర్చి.. భోగి వేడుకలు చేసుకున్నారు. హనుమకొండ జిల్లాలోనూ వేకువ జామున నుంచే మహిళలు ఇంటి ముందు అలికి ముగ్గులు వేశారు. మంచును సైతం లెక్క చేయకుండా మహిళలు పోటీ పడి ముగ్గులు వేశారు.బొమ్మల కొలువుభోగిపండుగ రోజునే సాయంత్రం పిల్లలకు భోగి పండ్లు పోయడం ఆనవాయితీ. దీంతో పిల్లలకుండే దిష్టి దోషాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు.

భోగినాటి సందడిలో బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఎప్పట్నుంచో ఇంట్లో ఉన్న బొమ్మ లను పోగేసి బొమ్మల కొలువు నిర్వహిస్తారు. ఈ యేడు కరోనా భయాలు తొలగిపోవడంతో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రాహుల్ జోడోయాత్రలో విషాదం

### గుండెపోటుతో కాంగ్రెస్ నేత చౌదరి సంతోష్ సింగ్ మృతి

**న్యూఢిల్లీ,జనవరి14(ప్రజామంటలు):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రలో శనివారం అత్యంత విషాదకర సంఘటన జరిగింది. జలంధర్ లోక్‌సభ నియోజకవర్గ సభ్యుడు, కాంగ్రెస్



నేత చౌదరి సంతోష్ సింగ్ గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయారు. పంజాబ్‌లోని ఫిలౌర్‌లో రాహుల్ గాంధీతోపాటు పాదయాత్రలో నడుస్తుండగా ఈ విషాదం జరిగింది. ఆయన గుండె కొట్టుకునే వేగం పెరగడంతో అకస్మాత్తుగా అస్వస్థులయ్యారు. వెంటనే ఆయనను ఫగ్వారాలోని విర్క్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ప్రకటించారు.రాహుల్ గాంధీ యాత్రకు విరామం ఇచ్చి, చౌదరి సంతోష్‌ను చూసేందుకు ఆసుపత్రికి వెళ్ళారు. యాత్రకు శనివారం విరామం ప్రకటించారు.

# వందే భారత్‌కు పట్టాభిషేకం

(మొదటి పేజీ తరువాయి)

విశాఖకు వెళ్లే రైలుకు 20834 నంబర్‌ను కేటాయించారు. అయితే అయితే రైలు టికెట్ చార్జీల్లో అప్‌అండ్‌డౌన్ మార్గంలో వ్యత్యాసాలు ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఉదాహరణకు విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు చైర్‌కార్ టికెట్ రేటు రూ.1720 ఉండగా, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ టికెట్ ధర రూ.3170 ఉంది. అదే సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే రైలులోని చైర్‌కార్ టికెట్ ధరను రూ.1665గా, ఎగ్జిక్యూటివ్ క్లాస్ చైర్‌కార్‌లో రూ.3,120గా పేర్కొన్నారు. దీంతో విశాఖ నుంచి వచ్చే రైలులో చైర్‌కార్‌కు అదనంగా రూ.55, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్‌కు రూ.50 చెల్లించాల్సి వస్తోంది. టికెట్ చార్జీలతోపాటు కేటరింగ్‌కు సంబంధించిన రేట్లలోనూ వ్యత్యాసం ఉంది.

**బేస్ చార్జీల్లో వ్యత్యాసం..**

సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందేభారత్ చైర్‌కార్ టికెట్‌లో బేస్ చార్జీలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ రైలులోని బేస్‌ఫేర్‌ను రూ.1207గా నిర్ణయించారు. ఇందులో సూపర్‌ఫాస్ట్ చార్జీ రూ.45, రిజర్వేషన్ చార్జీ రూ.40 ఉంచారు. అన్నింటికీ కలిపి మొత్తం రూ.65 జీఎస్టీ విధించారు. ఇక రైళ్లలో అందించే ఆహార పదార్థాలకు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.308 చొప్పున చార్జీ విధించనున్నారు. అయితే విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలులో బేస్ చార్జీని మాత్రం రూ.1206గా పేర్కొన్నారు. ఇక్కడ కేటరింగ్ చార్జీని రూ.364 పెట్టడంతో టికెట్ ధరలో రూ.60 వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతోపాటు సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే రైలులోని ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్‌లో బేస్‌ఫేర్‌ను రూ.2,485 విధించారు. ఇందులో రిజర్వేషన్ చార్జీ రూ.60, సూపర్‌ఫాస్ట్ చార్జీ రూ.75, జీఎస్టీ రూ.131గా పేర్కొన్నారు. కేటరింగ్ చార్జీలకు రూ.369 వసూలు చేస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో చూపిస్తున్నారు. ఇక విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలులో కేటరింగ్‌కు రూ.50 అదనంగా తీసుకుంటూ రూ.419 వసూలు చేస్తున్నారు.

**రైలులో అందించే ఆహార పదార్థాలు ఇవే..**

వందేభారత్ రైలులో షెడ్యూల్ ప్రకారం అందించే ఆహార పదార్థాల్లో మార్పులు ఉండనున్నట్లు తెలిసింది. ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తారని, అందుకే రైలులో ఆహార పదార్థాల రేటులో వ్యత్యాసం ఉందని ఐఆర్‌సీటీసీ అధికారులు ప[illegible]గా చెబుతున్నారు. టికెట్ బుకింగ్ చేసుకునే సమయంలో ఆహారం కావాలా? వద్దా? అనే దానిని ప్రయాణికుడు ఎంచుకోవచ్చని, భోజనం వద్దనుకుంటే ఆ మొత్తాన్ని టికెట్ ధర నుంచి మినహాయిస్తారని వారు చెబుతున్నారు.

**టికెట్ల ధరలు(రూపాయల్లో) ఇవీ..**

| సికింద్రాబాద్ నుంచి... | చైర్‌కార్ | ఎగ్జిక్యూటివ్ క్లాస్ |
|---|---|---|
| వరంగల్ | 520 | 1,005 |
| ఖమ్మం | 750 | 1,460 |
| విజయవాడ | 905 | 1,775 |
| రాజమండ్రి | 1,365 | 2,485 |
| విశాఖపట్నం | 1,665 | 3,120 |
| విశాఖపట్నం నుంచి... | | |
| రాజమండ్రి | 625 | 1,215 |
| విజయవాడ | 960 | 1,825 |
| ఖమ్మం | 1,115 | 2,130 |
| వరంగల్ | 1,310 | 2,540 |
| సికింద్రాబాద్ | 1,720 | 3,170 |

## ప్రభుత్వ నిషేధిత చైనా మాంజాను

# ఉపయోగిస్తే చట్టప్రకారం చర్యలు

**ఎస్పీ సింధు శర్మ**

**జగిత్యాల జనవరి 14 (ప్రజామంటలు):** సంక్రాంతి పండుగకు గాలి పటాలతో పాటు పక్షులను ఎగరనిద్దామని చైనా మాంజా తో తలెత్తే అనర్థాల పై అందరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ సింధూ శర్మ ఐపీఎస్ అన్నారు. గాలి పటాలు



ఎగరడం కోసం వినియోగించే మాంజా పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు ,పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని అన్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని ఈ యొక్క చైనా మాంజా ను నిల్వచేసిన,రవాణా చేసిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ యొక్క చైనా మాంజా ను ఎవరైనా తయారు చేసిన లేదా, అమ్మినా,రవాణా చేసినా సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ లకు గాని డయల్ 100 గాని ఫోన్ చేసి తెలపాలి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో సంబంధిత అధికారులు గాలిపటాలు అమ్మే దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది.

## రామాలయంలో

# శ్రీ గోదాదేవి రంగనాయకులు స్వామి కళ్యాణం

**జగిత్యాల జనవరి 14 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని ధరూర్ క్యాంప్ రామాలయం లో శ్రీ గోదా దేవి- రంగనాయకులు స్వామి వార్ల కళ్యాణ



మహెూత్సవం కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ ఎమ్మెల్యే ను శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట దావ సురేష్, కౌన్సిలర్ శ్రీలత రామ్మోహన్ రావు, ఆలయ ఛైర్మెన్ బ్రహ్మాండబేరి నరేష్, నాయకులు రాము, పట్టణ బిఆర్ఎస్ నాయకులు, భక్తులు తదితరులు ఉన్నారు.



**జగిత్యాల జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పి.పి) గా నియామకానికి సహకరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన పి.పి. జంగిలి మల్లికార్జున్. శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే. పాల్గొన్న పట్టణ మున్నూరు కాపు సంఘం సభ్యులు**

# ఘనంగా సంక్రాంతి క్రీడోత్సవాలు

**జనగామ జనవరి 14 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ జక్కుల అనిత వేణుమాధవ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వార్డు యువతకు క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా కౌన్సిలర్ టాస్ వేసి క్రికెట్ ఆడి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానుద్దేశించి అనిత మాట్లాడుతూ.... సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వార్డులోని యువత మొత్తం కలసి ఐకమత్యంతో ఎన్నోఏళ్లుగా క్రీడలను నిర్వహించుకోవడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు యువకులు కెమిడి కృష్ణ, కందుల రాజు, కూరపాటి రాజు, జయకృష్ణ, పండుగ సాయి, మాటూరి శ్రీనివాస్, మార్క ప్రవీణ్, చింతకింది నరేష్, రాఘవేందర్ , చిగురు నవీన్, కిరణ్, ఆకాష్, గుండా శ్రీను, నూనె నవీన్, సంతోష్, బాను, మహేసు శ్రీకాంత్ , శ్రీనివాస్ తో పాటు 100 మంది యువకులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల

# జ్యోతి స్మారక భవనం కార్పొరేషన్‌గా ఏర్పాటు?

**క్రియాశీలక పదవిలో కాశోజు శంకరమ్మ?!**

తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలను అర్పించిన అమరవీరుల జ్ఞాపకార్థం తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న స్మారక భవనం తెలంగాణ అమరవీరుల జ్యోతి. రాష్ట్ర రాజధాని హైదరాబాదు హుస్సేన్ సాగర్ సమీపంలోని జలదృశ్యంలో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 1969లో జరిగిన తొలి ఉద్యమంతోపాటు మలిదశ ఉద్యమంలోనూ వందలాది మంది ప్రాణాలు అర్పించారు. తెలంగాణ ఉద్యమానికి అనునిత్యం ప్రేరణగా నిలిచిన అమరవీరుల స్మృతి యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచేందుకు శాశ్వత స్మృతిచిహ్నాన్ని ప్రభుత్వం నిర్మిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమరవీరుల స్మృత్యర్థం అత్యాధునిక స్మారక భవనాన్ని ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ స్మారక భవనంలో తెలంగాణ చరిత్రకు సంబంధించిన సకల వివరాలను తెలియజేసేలా ఏర్పాటు చేయనున్నారు. ఐదు అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణానికి దాదాపు 100 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుందని అంచనా వేయబడింది. 1200 టన్నుల స్టీల్‌తో మొదటి నుంచి చివరి అంతస్తు వరకు అమరజ్యోతి నిర్మాణం జరుగుతోంది. పైన 54 %శ% 37 మీటర్ల ప్రమిద ఉంటుంది. ఈ ప్రమిదపై 26 మీటర్ల ఎత్తున వెలుగుతున్న జ్యోతిని నిర్మిస్తున్నారు. ఈ జ్యోతి నిరంతరం వెలిగుతూనే ఉంటుంది. మూడో అంతస్తు నుండి అమరుల జ్యోతికి నివాళులు అర్పించడం, అమరుల జ్యోతి చుట్టూ ప్రదక్షిణలు చేయవచ్చు. తెలంగాణ రాష్ట్ర సాధన చరిత్ర, తెలంగాణ మహానుభావులకు సంబంధించిన ఫొటోలు, ఇతర రూపాల్లో తెలియజేయడానికి ఏర్పాట్లు చేయనున్నారు. అత్యాధునిక గ్రంథాలయాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ తెలంగాణ అమరవీరుల జ్యోతి స్మారక భవనం పనులు పూర్తిగా చివరి దశకు చేరుకున్నట్లుగానే ఉంది 2023 సం. చివరి కల్లా ఈ భవనం ప్రారంభమవడానికి ముహూర్తం దాదాపు ఖరారు అయినట్లుగా కనిపిస్తుంది. అయితే కెసిఆర్ సార్ ఎన్నో తన తరహా రాజకీయ ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు అందులో భాగంగానే మలి తెలంగాణ ఉద్యమం లో మొదటిగా ఆత్మాహుతి కి పాల్పడి ఉద్యమానికి వెలుగు దివ్వెలా మారిన ఉత్ప్రేరకమ్ అయినా కాసోజు శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మ కు తెలంగాణ అమరవీరుల జ్యోతి స్మారక భవనం ను కార్పొరేషన్ లేదా ప్రత్యేక సంస్థ గా ఏర్పాటు చేసి అందులో శంకరమ్మ కు కీలక పదవిని ఇవ్వబోతున్నారు అనేది విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే తెలంగాణ అమరవీరుల జాతి తల్లి గా ఆమెకు ప్రత్యేక గుర్తింపు రానుంది. గతంలో శంకరమ్మ కు తెరాస పార్టీ ద్వారా హుజూర్ నగర్ ఎమ్మెల్యే బి- ఫారం ఇచ్చారు కానీ నాటి ఎన్నికల నగారాలో రాజకీయ పరీక్షల్లో శంకరమ్మ గెలుపు పొందలేకపోయింది. దానితో విపక్షాలకు వూతంగా రెండవ పర్యాయం 2019 లో కెసిఆర్ సార్ ఎన్నికలు గెలిచినప్పటికిని శంకరమ్మ ఓటమి వల్ల తెలంగాణ ఉద్యమ నాయకులు, అమరవీరుల పట్ల కనీస భాద్యతగా గెలిపించుకోవాలని చిత్తశుద్ధి లేకుండా ఆ వర్గం వారికి కెసిఆర్ వ్యతిరేకి అనే ముద్రను విపక్షాలు ప్రతీ సందర్భంలో ఒక అజెండా పాయింట్ గా దుయ్యబడుతున్నారు. శంకరమ్మ కూడా ఎన్ని పక్క ప్రధాన పార్టీలు ఇప్పటివరకు పార్టీ మార్పు పై ఆహ్వానం అందించినప్పటికిని కెసిఆర్ సారు పై ఉన్న విశ్వాసం, తెలంగాణ పై ఉన్న ప్రేమ వర్ణనాతీతం. అయితే కెసిఆర్ సార్ ఏది చేసినా అంతుచిక్కే వ్యవహారం లా ఉండదు. ప్రతిపక్షాల ఎజెండాను






ఎప్పటికప్పుడు తిప్పి కొట్టే వ్యూహ రచనల్లో కేసీఆర్ సిద్ధహస్తుడు. అందులో భాగంగానే ఈసారి ఎన్నికల ముందు అమరవీరుల జ్యోతి స్మారక భవనం ఏర్పాటు అందులో శంకరమ్మ కు ప్రత్యేక గుర్తింపు ద్వారా ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు తద్వారా ఎలాంటి వర్గం వారు అయినా కెసిఆర్ సార్ గుర్తింపుకు నోచుకునే వారే అనే ముద్ర వేయించుకుంటున్న శభాష్ కెసిఆర్ సార్ అనేలా మార్చుకుంటున్నారు. కెసిఆర్ సార్ రాజకీయ వ్యవహారంలో చాతక పక్షి లాంటి వాడు. అవకాశంను అందిపుచ్చుకునే అవకాశవాది లేదా అవకాశం వచ్చే వరకు ఓపికగా ఎదురుచూసే ఎదురీదేవాది. తెలంగాణ అమరవీరుల జ్యోతి స్మారక భవనం కార్పొరేషన్ గా ఏర్పాటు అనేది ఒక విధంగా విపక్షాలకు సైతం నోట మాట రాని పరిస్థితి. రాజకీయాల విషయం ఏమైనప్పటికి అమరవీరుల సంస్మరణ గా ఏర్పాటు చేస్తున్న ఈ అమరవీరుల స్మారక జ్యోతి భవనం తెలంగాణ చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది అలాగే కలకాలం కెసిఆర్ సార్ పేరు సువర్ణ అక్షరాలతో తెలంగాణ రాష్ట్ర ప్రజల మదిలో ఉండిపోతుంది.

**సిరిసిల్ల రాజా విక్రాంత్ శర్మ**
**9963349493**

# కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**చీఫ్ విప్ దాస్యం**

**హన్మకొండ జనవరి 14 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఈనెల 18 నుండి కంటి వెలుగు కార్యక్రమము ఉన్నందున ఏర్పాట్లను సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 16 బృందాలను ఏర్పాటు చేసి 52 ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన క్యాంపులలో నిపుణుల బృందం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితముగా కంటి అద్దాలు, మందులు, సలహాలు, అవగాహన కలిగించడం జరుగుతుందని, ఆపరేషన్ లేదా ఇంకా మంచి వైద్యము, చికిత్స అవసరమైన వారిని గుర్తించి జాబితా రూపొందించడం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పరీక్షా కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు, విద్యుత్తు, మంచినీటి సౌకర్యాలను మునిసిపల్, ఆరోగ్య, రెవెన్యూ సిబ్బంది కల్పించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్థానిక కార్పొరేటర్లు చొరవ తీసుకొని దగ్గరుండి సమన్వయం చేయాలన్నారు వాలంటీర్లను సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఈనెల 18 నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌరవ ప్రభుత్వ చీఫ్ విప్ మరియు వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు శ్రీ దాస్యం వినయ్ భాస్కర్ సూచించారు. హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ.... ఏర్పాటు చేసిన ఏర్పాట్లను, టీముల వివరాలు, తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్ఓ డా. సాంబశివరావు, వరంగల్ పశ్చిమ పరిధిలోని కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, ఎం. రాజు, రంజిత్ రావు, మానస. చెన్నం మధు, శ్రీనివాస్, నర్సింగ రావు, లోహిత, రావుల కోమల, లక్ష్మి కుమారి, అడిషనల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మదన్మోహన్, డిప్యూటీ





డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యాకూబ్ పాషా, క్వాలిటీ కంట్రోల్ అధికారి డా. చుక్కయ్య, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్లు డా. జ్ఞానేశ్వర్, డా. రాజేష్, డిప్యూటీ కమిషనర్ జోన, రవీందర్ యాదవ్ జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, వైద్యాధికారులు, డిపిఓ శ్రీనివాస్, డిప్యూటీ డెమో ప్రసాద్, రవీందర్ రెడ్డి, డి.డి.ఎం. ప్రవీణ్ , సానిటరీ ఇన్స్పెక్టర్లు, మెప్మా, ఎలక్ట్రిసిటీ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సూపర్ వైజర్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్

# రాష్ట్ర కన్వీనర్ గా డా. షేక్ చాంద్ పాషా నియామకం

**జగిత్యాల జనవరి 14 (ప్రజామంటలు):** టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కన్వీనర్ గా డా. షేక్ చాంద్ పాషా నియామకం కావడంతో ఇంద్ర భవన్ లో ఎంఎల్సి టీ. జీవన్ రెడ్డి ఘనంగ సన్మానించారు. చైర్మన్ డా. వినోద్ కుమార్ చేత నియామక పత్రం అందుకున్న సందర్భంగా టీ. జీవన్ రెడ్డి అభినందించారు. గల్ఫ్ లో, విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐ లను మరియు అక్కడ వాళ్ళు పడే బాధలను గమనించి, మెరుగైన సేవలను అందించాలని వారు సూచించారు. ఈ అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎన్ఆర్ఐ హెల్ప్ లైన్ సెంటర్ ప్రతి జిల్లాకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓపెన్ చేసి జిల్లా వ్యాప్తంగా, మండల స్థాయి లో కమిటీలు వేసి, ప్రజలను మెరుగైన సేవలను అందిస్తాం అని డా. షేక్ చాంద్ పాషా సూచించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి దేవేంధర్, మాజీ చైర్మన్ గిరి నాగ భూషణం, మున్సిపల్ కౌన్సిలర్ గంగారాం, బండ శంకర్, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ మధు, టౌన్ ప్రెసిడెంట్ నేహాల్, ఎక్స్ కౌన్సిలర్ మునీర్ ఉద్దీన్ మున్ను, కౌన్సిలర్ అజహర్ ఉద్దీన్. వీరందరు చాంద్ పాషాకు శాలువాలు కప్పి అభినందించారు.



# నీడ కోసం

(కవిత)



సృష్టి అద్భుతాల పుట్ట
అన్వేషణ గనిలో దొరికిన
మనిషి ఓ జ్ఞాననిధి
తాను నిలబడ్డ భూఖండం
మొదలు అనంత
విశ్వాంతరాళాలను
రవికిరణమై ఆవహించాడు
పచ్చని చిగురుటాకై
క్షితి ఎదపై పరుచుకున్నాడు
నిప్పురవ్వగా కాంతులు
నింపాడు
ఎప్పుడూ ఏదో
సాధించాలనే తపన!
ఉప్పెనను అడ్డగిస్తున్న
సముద్ర ఘోషలా!
అంధకారంతో పోరాడుతున్న
అగ్నిశిఖలా!
తన రక్త మాంసాల
ఎముకల గూడుకు
ఓ నీడ కోసం
ఆలోచనల శిలాకుహరాలు
జ్ఞానం ఆయుధంగా
ప్రకృతి శక్తులపై ఆధిపత్యం!
పంచభూతాలు
ప్రపంచ నాగరికతలై
విశ్వమంతా మానవత్వమై
మనిషి విస్తరణ!
రాతియుగంలో
రాగవీణియ అనురాగమై
నవరసాల సుగంధాల
వాహినిలో కుటుంబం అతనికి
వటచ్ఛాయ
అందాల హరివిల్లు
అతనికి ఆరాధ్యదృశ్యం
ఇల్లు అనుబంధాల కూర్పు
తల్లి ఒడిలో దొరికే ఓదార్పు
మానవ వికాస ప్రస్థానంలో
గృహం ఒక ఆలంబన...

రచన:
పానుగంటి రామమూర్తి,
జనగామ.

## ప్రభుత్వ బడులను

# బాగుపరుచుకుందాం

**జడ్పీటీసీ గీకురు రవీందర్**

**చిగురుమామిడి జనవరి 14 (ప్రజామంటలు):** ప్రభుత్వ పాఠశాలల పరిసరాల పరిశుభ్రతను కాపాడే సామాజిక భాద్యత ప్రజలదే అని స్థానిక జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ ఉద్బోధించారు. మండల కేంద్రములో పత్రికా సమావేశములో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి మౌలిక సదుపాయాల కల్పనకు మన ఊరు-మన బడి కార్యక్రమములో నిధులు కేటాయించింది. తద్వారా పనులు కొనసాగుతున్నాయన్నారు. బలహీన వర్గాలు, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చదివే పాఠశాలల పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు నిర్లక్ష్యంతో వ్యవహరించరాదు. పాఠశాలలు మందు బాబులకు నిలయంగా మారాయని, సెలవు దినాల్లో ఆకతాయిలు పాఠశాలల మరుగుదొడ్లను, పరిసరాలను అపరిశుభ్ర పరుస్తున్నారన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్యనే ఉందనే విషయాన్ని గమనించి విద్యాలయాల పరిశుభ్రతను, పవిత్రతను కాపాడాలని హితవు పలికారు. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు స్థానిక నాయకులు తరుచు పర్యవేక్షణ చేయాలని, సెలవు దినాల్లో పోలీసు బ్లుకోట్స్ నిఘా ఉంచాలని పోలీస్ శాఖ వారిని కోరారు.



## ఆంధ్ర తండాలో యూత్ ఫెస్టివల్

# ప్రారంబించిన డా. సుగుణాకర్ రాజు

**జనగామ జనవరి 14 (ప్రజామంటలు):** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం ఆంధ్ర తండా లో రైజ్ యూత్ అసోసియేషన్ యువత డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్ రాజు వైద్యసేవల వల్ల వారి



చేతిలో పుట్టిన వారే యూత్ ఫెస్టివల్ కు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి మీరు రావాలి సర్ అని సుగుణాకర్ రాజును కోరగా వెళ్లారు. వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, యూత్ పిల్లలు, తల్లిదండ్రులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ ఆటల పోటీలను ప్రారంభించినందుకు చాలా సంతోషంగా ఉందని సుగుణాకర్ రాజు అన్నారు.

# పతంగులతో యువత సందడి

**సికింద్రాబాద్ జనవరి 14 (ప్రజామంటలు):** సిటీలో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. యువకులు, చిన్నారులు బంగ్లాల



పైకెక్కి పతంగులను ఎగుర వేస్తూ సందడి చేశారు. గాలిపటాలు విక్రయించే దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. మహిళలు రకరకాల పిండివంటలతో బిజీగా మారారు. సిటీ నుంచి పెద్ద సంఖ్యలో జనాలు సంక్రాంతిని పురస్కరించుకొని స్వంత ఊళ్ళకు వెళ్ళడంతో సిటీలోని ప్రధాన రహదారులు బోసి పోయి కనిపించాయి.

# వ్యవసాయ ప్రధాన పండగ సంక్రాంతి!

సంక్రాంతి అంటేనే ప్రకృతి పండగ. వ్యవసాయానికి పెద్దపీట వేసే మనం..ప్రకృతిని ఆరాధించి..పల్లెలను ముస్తాబు చేసి..అన్నదాతలను గౌరవించుకునే సంప్రదాయం. వ్యవసాయానికి చేదోడువాదోడుగా ఉన్న బసవన్నల సేవలను గుర్తించి వాటిని గౌరవించుకోవడం కూడా పరమార్థంగా వస్తోంది. మన పండగల్లో ఎప్పుడూ ఒక పరమార్థం ఉంటుంది. సంక్రాంతినాటికి అన్ని రకాల పంటలు పొలాల నుంచి ఇంటికి చేరుతాయి. సూర్యుడు సకల దేవతల తేజస్సును, ఓజస్సును, శక్తిని, సామర్థ్యాన్ని, అంశను, అనుగ్రహాన్ని తనలో నిక్షిప్తం చేసుకున్నాడు. సర్వజీవులనూ అనుగ్రహించే ఆ దివ్యమూర్తి ఆరాధన అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందుకే సంక్రాంతి ఓ పండగ కాదు, అదో సదాచారం. ప్రత్యక్ష నారాయణుడికి జ్యోతులు అర్పించడం తెలుగువారి సంస్కృతికి నిలువుటద్దం.రంగవల్లులు...భోగి మంటలు..పిండివంటలు... డూడూ బసవన్నలు.. హరిదాసులు...సంప్రదాయ వస్త్రాలు..ఇల్లంతా బంధువులు... ఆనంద డోలికలు...మూర్డోజుల తెలుగింటి పెద్దపండగ ఇవీ మన సంక్రాంతి పర్వదినం ప్రత్యేకతలు. సంక్రాంతి పండగ నెల రోజులూ తెలుగు పల్లె సీమల్లో సందడే సందడి. ధనుర్మాసం ప్రవేశించగానే సంక్రాంతి కోలాహలం మొదలవుతుంది. ముగ్గులు, గొబ్బెమ్మలు, పూల అలంకరణలతో ప్లలెల్లో ప్రకృతికి నిత్యారాధన చేస్తారు. మకర సంక్రమణం సమయంలో రథం ముగ్గులతో తీర్చిదిద్దడం పెద్దలకు పుణ్యలోకాల మార్గాలను సుగమం చేయడమేనని అంటారు. ఈ కాంలోనే హరిదాసులు, గంగిరెద్దుల వారు, జంగమ దేవరలు... ఇలా ఎందరో జానపద కళాకారులు ఇంటి ముందుకే వస్తారు. మనమిచ్చే కానుకలు అందుకుంటారు. ఒకప్పుడు వస్తుమార్పిడికి సంక్రాంతి సమయం ఆలవాలంగా ఉండేది. కొత్త అల్లుళ్ళు, బంధువుల రాక, పిండి వంటల తయారీ, పిల్లలకు భోగిపళ్ల అభిషేకాలు, పిడకలు దండకట్టడాలతో ప్రతి ఇంటా ఎంతో సందడి. నిజంగా ప్రతి గ్రామం ఈ పండగ రోజుల్లో ఓ సౌభాగ్య సీమగా మారుతుందనడంలో సందేహం లేదు. దేవీదేవతలను ఆరాధించి కృతజ్ఞతలు చెప్పుకోవడం, పితృదేవతలను స్మరించుకోవడం అటు భౌతికంగా, ఇటు ఆధ్యాత్మికంగా ఉన్నత భావాలకు నిదర్శనాలు. ఓ రకంగా చెప్పాలంటే రైతులను స్మరించుకుని, పాడి పశువులను లాలించే దే ఈ పండగ ప్రత్యేకత. సూర్యుడు ఆరోగ్య ప్రదాత కనుక ఆయన కోసం ప్రపంచ మంతా ఎదురుచూస్తున్న వేళ సంక్రమణం ఓ గొప్ప వరం. సృష్టిలోని పంచభూతాలను మనం ఆరాధిస్తాం. ఇదంతా ప్రకృతికి సంబంధించిన ఆరాధన. చెట్లు, పర్వతాలు, పంచభూతాలు ఒకటేమిటి అన్ని వస్తు పదార్థాలను మానవుడు వినియో గించుకుంటు న్నాడు. అందుకే వీటికి కృతజ్ఞతగా ఆరాధన చేయడం మానవ ధర్మం. సృష్టిలో ఉన్న ధర్మాన్ని అవగాహన చేసుకుంటే మనలో వివేకం కలుగుతుంది. సృష్టిలో ఉన్న వివేకం మనిషిలోనూ ఉంది. ఈ రెంటికి సంబంధం తెగిపోతే మానవుడు గతి తప్పుతాడు. మన పంటలు ఇంటికి వచ్చే వేళ... ముంగిళ్ల లో పాడి పొంగి పొరలే వేళ... గంగిరెద్దులు, జానపదులు ఆడిపాడే వేళ... పండగ తియ్యతియ్యగా చేసుకు నేందుకు ప్రజలు



సిద్ధమవుతారు. ముఖ్యంగా మన పల్లెల్లో నెలకొనే పండగ వాతావరణం కమనీయం. ఈ వేడుకలకంతటికీ మూలకారణం సూర్య భగవానుడే. కాబట్టి ఇది సూర్యదేవుడి పరంగా జరిగే పెద్ద పండగగా భావిస్తారు. భిన్న జాతులకు, మతాలకు, విభిన్నమైన దేవుళ్లు ఉండవచ్చు. కానీ అందరికీ ప్రత్యక్ష దైవం సూర్యుడు. సంక్రాంతి కూడా ప్రకృతి ఆరాధనకు సంబంధించినదిగా, పశువులను పూజించేదిగా గుర్తించాలి. ఈ ప్రకృతిలో ఉన్న ప్రతి వస్తువుని మానవుడు వినియోగించు కుంటున్నాడు. భారత భాగవతాది గ్రంథాలన్నీ మనిషికి ప్రకృతిధర్మం నేర్పడానికే రూపొందాయి. క్రతువులు, వ్రతాలు పూజలు ఏదైనా మనిషికి బుద్ధి సమకూర్చేవే. శిక్షణ, రక్షణ, పోషణ, క్రమశిక్షణ ఈ నాలుగు సమాజానికి నాలుగు అంగాలు.
భూమి నుంచి సారాన్ని, ప్రాణశక్తిని వెలికి తీసి దానిని పంటగా పండించి, ఆ పంటను మన అందరికీ చేర్చి ఆహారంగా అందించి, మనిషి, జంతుజీవాల ప్రాణశక్తిని పెంపొందించి, శక్తిమంతులను చేస్తున్నది రైతు. కర్షక బాంధవుడు, శ్రమజీవి, రైతు వారిద్దరి వలన మన జీవితం సాగుతోంది. ఈ విషయాన్ని గమనించిన నాడు సమాజం సుఖంగా ఉంటుంది.అందుకే పండగల ప్పుడు వీటి విశిష్టతలను తెలియచేసుకుంటాం. ఆధ్యాత్మి కత అంటే నోములు, వ్రతాలు, పూజలు మాత్రమే కాదు భాగవతంలో చెప్పినట్టు భగవంతుడు తర్వాత రైతు, కర్షకుడు, శ్రామికుడు వీరే దేవుళ్లు. ఇదంతా ప్రకృతిలో భాగగంఅ గుర్తించి ఆచరించడమే ముఖ్యం. కాలచక్రంగా ఉన్న సూర్యుడి గమనంతో ముందుకు సాగడం ముఖ్యం. అందుకే మకర సంక్రాంతినాడు చేసే దాన, జప, తర్పణాల వల్ల మంచి ఫలితాలు ఉంటాయని భావిస్తారు. సూర్యుడు ప్రాతఃకాలానికి చైతన్యం కలిగిస్తున్నాడు. మానవజాతికి, పశుపక్ష్యా దులకు, చెట్లకు అమృతత్వాన్నిచ్చే జీవన దాత. కిరణ జన్య సంయోగ క్రియ ద్వారా వృక్షాల పెరుగుదలకు, జీవకణాల వృద్ధికి కారణమవుతున్న ఆయనను సృష్టి కార్యక్రమ నిర్మాత అనవచ్చు. చల్లని చలుగాలుల నుంచి నులివెచ్చని వేడి అందించే సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడం..ఉత్తరాయణ పుణ్యకాలం ఆగమించడం సంక్రాంతి ప్రత్యేకత. ఈ కాలం పిత్రు దేవతలకు ప్రీతికరమైంది. ఈ ఉత్తరాయణ కాలంలోనే చెట్లు కొత్త చిగుళ్ళు తొడిగి, పుష్పించి,కాయలు కాచి మధుర ఫలాలు అందిస్తాయి. స్త్రీ పురుషుల మధ్య పరస్పర ఆకర్షణ ఎక్కువగా ఏర్పడేది ఈ కాలం లోనే.... బహుశా ఇన్ని కారణాల వల్ల ఉత్తరాయణ కాలం పుణ్య కాలం అయింది. అంతే తప్ప దక్షిణాయం చెడ్డది కాదని గుర్తుంచుకోవాలి.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు, "నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## రహస్యం

ఒక ఊళ్ళో బాలచంద్రం అనే రైతు ఉన్నడు.అతనికి ముగ్గురు కొడుకులు. భార్యతో బాలచంద్రం రోజూ పొలానికి పొద్దున్నే పొయ్యేది.ఇంట్లో తాత నాయనమ్మ ముగ్గురు పిల్లలు.పిల్లలు ముగ్గురు బడికి వెళ్తుండే.తిరిగి వచ్చి నాయనమ్మ పెట్టిన ఉపాహారం తిని చక్కగా బడిలో ఇచ్చిన చదువు యొక్క ఇంటిపని పూర్తిచేసుకుని నాయనమ్మకి మొక్కలకి నీళ్లు పెట్టుడు, తాతకి ఏదన్నా వ్యవసాయ పనిముట్లు బాగుచేయదం ఇట్ల చేదోడు వాదోడుగా ఉండేది.



ముగ్గురు కొడుకులు చదువు ముగించుకొని అదే ఊళ్ళో మంచి దనిపించిన ఉద్యోగాలల్లో కుదురుకున్నారు.కొద్ది నెలల తేడాతో ముగ్గురు కొడుకులకు దగ్గర దగ్గర ఉన్న ఊళ్లలో నుంచి తగిన అంతస్తులతో పెళ్లిళు కూడ ఐనయి.

ఇంక జీవితాల్లో మామూలే కదా!కొడుకులు కోడళ్లలో గొడవలు మొదలవడం.మీది ఎక్కువ ఖర్చులు అంటే మాది ఎక్కువ సంపాదన ఇట్ల చిన్నచిన్నగా మొదలైన గొడవలు కొన్ని నెలలు గడిచేటప్పటికి తారాస్థాయికి చేరుకున్నయ్.

ఈ ముగ్గురు అన్నదమ్ములు చదువుకునే సమయంలోనే వాళ్ళ తండ్రి వాళ్లకి ఒక విషయం పదే పదే చెప్తుండేది.మీకొక రహస్యం చెప్తున్న."మీరు ఇక కలిసి ఉండలేం అనుకున్నపుడు మనఇంట్లో దేవుడి గదిలో ఒక పెట్టె ఉంది అది తెరచి చూడండి అందులో ఒక నిధి ఉంటుంది"అని.

అదేమో విచిత్రం ఇన్ని ఏళ్ళు ముగ్గురికి ఆ విషయం గుర్తుకే రాలేదు.సరే ఇప్పుడు చూద్దాం తండ్రిగారు మనకోసం ఏం దాచాడో అని కుటుంబ సభ్యులందరూ ఇంకా ఊళ్ళో కొందరు పెద్దల ముందు ఆ పెట్టె తెరుస్తారు. అందులో ఒక కాగితం ఉంది. ఆ కాగితంలో ఇలా రాసి ఉంది."కష్టపడితే వచ్చే ధనం కన్నా వేరే ఏదీ సంతోషమివ్వదు.అందుకే నా ముగ్గురు పిల్లలకి చిన్నప్పుడు అన్ని పన్లు చేయడం అలవాటు చేశాను.సులభంగా వచ్చే సుఖాలమీద సమయం వృధా చేయకుండా కష్టాన్ని మాత్రమే నమ్ముకోండి. అప్పుడు మీ మధ్య గొడవలు కూడా ఉండవు".


ముగ్గురు కొడుకులు ఒకరి ముఖం ఒకరు చూసుకొని అవును తండ్రి గారు చెప్పిన మాట ఎంతో నిజం. ఇక మీద మనం అలాగే ఉండబోతున్నాం అనుకున్నారు.

- డా.భోజన్నగారి అనసూయ.
నిజామాబాద్, 99898 22494.

## తెలుగు వారి ముంగిళ్ళలో ముగ్గులు

శుచిత్వం, ఆచారం, అలంకార ప్రియత్వం, కళా ప్రదర్శనం, ఆరాధనా విధానానికి సంకేతాలు రంగవ ల్లులు. శుభ్రంగా ఊడ్చి, కళ్ళాపు చల్లి ముంగులతో అలంకృతాలయ్యే తెలుగునాట ముంగిళ్ళు తరతరాల వారసత్వ సంస్కృతులకు ప్రతిబింబాలు. ముగ్గు లేదా రంగవల్లి ఇంటి వాకిలి, ఇంటి లోపలా అందంగా అలంకరించు ప్రాచీన కాలం నుండి వస్తున్న సాంప్రదాయం. తెలుగు సీమల్లో ప్రతి ఇంటి లోగిళ్లలో రాళ్లు రప్పలూ లేకుండా ముంగిట అలంకబడిన నేల...మేఘాలు లేని గగనతలం... అందలి చుక్కలు, రాత్రి వేళల కానవచ్చే నక్షత్రాలు, చుక్కల చుట్టూ తిరుగుతూ గళ్ళల్లో చుక్కలను పదిల పరిచే ముగ్గులు ఆకాశంలో కనిపించే మార్పులకు సంకేతాలు. ముగ్గు మధ్యలో చుక్క అనాదిగా సూర్య కేంద్రక సిద్ధాంతానికి ఆధార భూతమైన సూర్య స్థానానికి సంకేతం. గీతలు స్థిత శక్తికి, చుక్కలు గతి శక్తికి సంకే తాలని,





ముగ్గులు వేయడం అనాదిగా వస్తున్న సాంప్రదాయాలు. ఇవి ముగ్గ పిండితో వేస్తారు. ఇంటి ముందు పేడ నీటితో కళ్ళాపి జల్లి తడిగా ఉండగానే ఈ పిండితో ముగ్గులు సాధారణంగా స్త్రీలు వేస్తారు. ముగ్గ అనగా తెల్లగా ఉండే ఒక రకమైన పిండి. సాధారణంగా ముగ్గులు పెట్టేది మామూలు పిండితో, తరువాత బట్టీల ద్వారా, నత్తగుల్లలు, ముగ్గ రాళ్ళతో ముగ్గను తయారు చేయడంతో దానిని అధికంగా వాడుతున్నారు. సంక్రాంతికి ముగులను పిండితో వేయడం ప్రాచీన ఆచారం.

అయితే ధనుర్మాస యుక్త సంక్రాంతి సంబంధిత పర్వదినాలలో వేసే ముగ్గులు పలువిధ ప్రత్యేకాలు. చుక్కలు పెట్టి, హద్దులు ఏర్పరచి, గీతలను సున్నితంగా కలపడంలో, మెలికలు తిప్పడంలో, కళానై పుణ్యాలు ప్రదర్శితాలవుతాయి. సర్వ సంపదలకూ అధిష్టాన దేవతయైన అష్టలక్ష్మికి ఇంటి తల వాకిట పీఠం వేయ బడుతుంది. కనుమ నాడు వాకిళ్ళను మూసేసే ముగ్గు కూడా వేసి, లక్ష్మీ దేవిని బయటకు వెళ్ళ నీయకుండా వాకిళ్ళను మూసివేసే ముగ్గులు పెడతారు. నెమళ్ళు, హంసలు, రామ చిలుకలు, గరుత్మంతులు, మత్స్య కూర్మాది అవతారాలు, అందానికి, ప్రయోజకత్వానికి, మెలికలు తిప్పడంలో కళాభిజ్ఞతను తెలియ జేస్తాయి. స్వర్గ ద్వారాలు తెరిచి ఉంచే ముగ్గు, గుమ్మడి పండు ముగ్గు, సూర్య రథాల ముగ్గు, చుక్కల రథాల ముగ్గ ఉత్తరాయణంలో ప్రత్యక్ష దైవమైన సూర్య గమనాన్ని సూచించే ముగ్గులు. ముగ్గులలో గణిత శాస్త్ర

సంబంధిత కోణాలు, త్రిభుజాలు, చతుర్భుజాలు, త్రికోణాలు, దీర్ఘ చతురస్రాలు, అష్ట కోణాలు, సమాంతర రేఖలు చోటు చేసుకుంటాయి. ముగ్గులు శ్రీచక్ర సమర్పణా సంకేతాలని తత్వవేత్తల భావన. విల్లు ధనుర్రాశికి, ప్రతీక అయినట్లు మేక, ఎద్దు, సింహం, పీత, చేప లాంటివి నవ గ్రహాలకు గుర్తులుగా ముగ్గులు వేస్తారు. భూమికి ఉన్న దక్షిణ దిక్కులో దక్షిణ ధృవం ఉంటుంది. దాని నుండి వచ్చే అయ స్కాంత శక్తులనే... పిశాచాలు, రాక్ష సులు అని ప్రాచీనులు చెప్పేవారు. పాములు కూడా దక్షిణ దిశనే ఎక్కు వగా సంచరిస్తుంటాయి. అవి ఇళ్ళ ల్లోకి ప్రవేశించనీయ కుండా వాకిలి ముందు ముగ్గులు వేయడం, అవి బియ్యపు పిండితో వేయడం అత్యంత ప్రాచీన కాలం నుండి ఉంది. ఇంటి ముందున్న పిండి తిని ఇళ్లల్లోకి రాకూడదనే భావన ఇందులో ఇమిడి ఉంది. మూడు రోజులు బంధుగణ సమేతులై ఆనందోత్సాహాలు పంచుకున్న అనంతరం పండగను సాగనంపేందు కే రథం ముగ్గు వేస్తారు. అందరూ ఒకరికి ఒకరు తోడుగా, కలసి మెలసి సహజీవనం గడపాల నేదే ఒక ఇంటి రథం తాడును, పక్క ఇంటి రథం ముగ్గుతో కలిపే రథం వెనక ఉన్న భావం.



-ఆర్కె సంగనభట్ల
9440595494

## కోడి పందాల్లో
# డిజిటల్ లావాదేవీలు

హైదరాబాద్: ఈసారి సంక్రాంతి కోడి పందాల్లో పందెంరాయుళ్ళు నేరుగా నగదు మార్పిడి పద్ధతిని పక్కన పెట్టి డిజిటల్ లావాదేవీల బాట పట్టారు. నిర్వాహకులు బరుల వద్ద ప్రత్యేకంగా ఆన్‌లైన్ మనీట్రాన్స్‌ఫర్ కోసం క్యూఆర్ కోడ్ స్కానింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కోట్లాది పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ ఎపిలో ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడిపందాలు తప్పక నడుస్తాయి. ఈసారి మాత్రం కోడిపందాలపై ప్రభుత్వం నుంచి పెద్దగా ఆంక్షలు లేకపోవడంతో భారీగా కోడిపందాలు సాగుతోన్నాయి. పందాలకు అనుబంధంగా పేకాట,



రూపాయలు చేతులు మారుతున్నాయి. బరిని బట్టి, కోడిని బట్టి పందాలు నిర్వహిస్తోన్నారు. డైరెక్టు పందాలు, ఇన్‌డైరెక్టు పందాలు జోరుగా సాగుతోన్నాయి. పెద్ద బరుల్లో అయితే రూ. లక్ష మొదలుకుని రూ. పది లక్షల పైబడి పందాలను కాస్తున్నారు. చిన్నబరుల్లో రూ. 5 వేలు నుంచి రూ. 50 వేల వరకు బెట్టింగ్ నడుస్తోంది. కొందరు పందెంరాయుళ్ళకు కాసులు పంట పండుతుంటే, మరికొందరు భారీగా నష్టపోతున్నారు. ఎపిలోని అన్ని జిల్లాల్లో కలిపి ఇప్పటి వరకు రూ. 450 కోట్ల వరకు బెట్టింగ్ నడిచినట్లు తెలుస్తోంది. అందులోనూ గోదావరి జిల్లాల్లో దాదాపు రూ. 300 కోట్లు పైబడి బెట్టింగ్ జరిగినట్లు సమాచారం.

**పందెంరాయుళ్ళకు సకల సౌకర్యాలు**

కోడి పందాల బరుల వద్ద గోవా కల్చల్ కనిస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పందెంరాయుళ్ళు, విఐపిలు, వివిఐపిలకు సకల సౌకర్యాలను పందాల నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. మరీముఖ్యంగా ఈ హడాహుడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా దర్శనమిస్తోంది. కృష్ణా జిల్లా గన్నవరంలోని పందాల నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేశారు. బరిలోకి వచ్చే పందెంరాయుళ్ళకు క్యాసినో తరహా మర్యాదలు సిద్ధం చేశారు. పందెంరాయుళ్ళ అభిలాషకు అనుగుణంగా విఐపి, వివిఐపి వంటి మర్యాదలను చేస్తున్నారు. అలాగే విదేశీమద్యం, విందుభోజనంతో పాటు ఉదయం సాయంత్రం అల్పాహారం, టీ, కూల్ డ్రింక్స్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

**ఈసారి పెద్దగా ఆంక్షలు లేవు**

గుండాట శిబిరాలు కూడా భారీగా వెలిశాయి. కొన్ని చోట్ల అయితే ఫ్లడ్‌లైట్లు పెట్టి మరీ రాత్రులు పందాలను కొనసాగిస్తున్నారు. గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల్లో ఢీ అంటే ఢీ అన్నట్లుగా జోరుగా కోడిపందాలు కొనసాగుతోన్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 350 వరకు బరులు ఏర్పాటైతే, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 250 వరకు కోడి పందాలా బరులు ఏర్పాటు చేశారు.

**బరిలో గెలిస్తే బుల్లెట్ బండి, కారు బహుమతి**

గోదావరి జిల్లాల్లో కోడి పందాల బరుల్లో గెలిస్తే బుల్లెట్ బండి, కారు బహుమతిగా ఇస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలోని వలసపాకలో పందాలను వీక్షించేందుకు అధికార వైసీపీ నేతలు ప్రత్యేకంగా పాసులను జారీ చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో కోడిపందాల సందర్భంగా పలుచోట్ల ఉద్రిక్తత చోటుచేసుకుంది. ముమ్మిడివరం, కోడూరుపాడులోని బరులను పోలీసులు ధ్వంసం చేసినప్పటికీ అధికార వైసీపీ పార్టీ నేతలు మళ్ళీ కొత్త ప్రాంతాల్లో బరులను ఏర్పాటు చేసి కోడిపందాలను ఆడిస్తున్నారు. రావులపాలెంలో ఏర్పాటు చేసిన పందెంబరులు, శిబిరాలలోని బ్యారీకేడ్లను పోలీసులు తొలగించడంపై వైసీపీ ఎంఎల్‌ఎ చీర్ల జగ్గిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మీకేంపని అంటూ పోలీసులను ఆయన నిలదీశారు. బరుల దగ్గర నుంచి వెళ్ళిపోవాలని పోలీసులను హెచ్చరించారు. దీంతో ఎంఎల్‌ఎ జగ్గిరెడ్డి తీరుపై ఉన్నతాధికారులకు పోలీసులు ఫిర్యాదు చేశారు. పత్తిపాడు మండలంలో వైసీపీకి చెందిన ఓ ఎంఎల్‌ఎ సమీపబంధువు బరులను ఏర్పాటు చేసి పందాలను ఆడిస్తున్నారు.

# సూర్యుడు మకర రాశి ప్రవేశం

ఖగోళశాస్త్రం ప్రకారం ఒక్కోనెల ఒక్కో రాశిలోకి సూర్యుడు సంక్రమిస్తాడు. ఇలా ప్రతి నెలా మనకు సంక్రాంతి వస్తూనే ఉంటుంది. ఏడాదిలో వచ్చే పన్నెండింటిలోనూ ముఖ్యమైంది మకరరాశిలో సూర్యుడు సంక్రమించే సమయం. అదే మకర సంక్రాంతి. క్రాంతి అనే మాటకు సంక్రమించడం అని అర్థముంది. సూర్యగమనాన్ని బట్టి వచ్చేదే మకర సంక్రాంతి. లిప్త పాటు కాలంలో మకర రాశిలోకి ప్రవేశించే సూర్య భగవానుడు ఉత్తరాయణ మహాపుణ్య కాలానికి నాంది పలుకుతాడు.తృటిలో వందోవంతు కాలంలో సూర్యుడొక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ సమయాన్ని పుణ్యకాలంగా పరిగ ణిస్తారు. అత్యంత సూక్ష్మంగా ఉండే ఈ కాలాన్ని కనిపెట్టడం దాదాపు అసాధ్యం. అందువల్లే సంక్రమణానికి ముందు పదహారు, తరువాత పదహారు ఘడియలు పుణ్యకాలంగా పరిగణిస్తారు. ఈ ఘడియ ల్లోనే సంక్రాంతి సంబరాలను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సూర్య గమనాన్ని ఆధారంగా చేసుకుని అనుసరించే కాలగణన పద్ధతే 'సౌరమానం'.సూర్యగమనం మూడు విధాలు. అవి మంద, శీఘ్ర, సమగతులు. ఉత్తరాయణంలో సూర్యుడు ఆరోహణ క్రమంలో ఉంటాడు కాబట్టి గతి మాంద్యం పొందుతాడు. అంటే నిదానంగా కదులుతాడన్న మాట. వృషభం మొదలుకుని కన్యా రాశి వరకు గల ఐదు రాశులలో సంచరి స్తున్నప్పుడు పగటి సమయం ఎక్కువగా, రాత్రి సమయం తక్కువగా ఉంటుంది. దక్షిణాయనంలో సూర్యుడు అవరోహణ క్రమంలో ఉంటాడు కాబట్టి గమనం వేగంగా సాగుతుంది. దీనివల్ల వృశ్చికం నుంచి మీనం వరకు గల 5 రాశుల్లో సూర్యుడు సంచరిస్తున్నప్పుడు పగటి పూటల నిడివి తగ్గుతుంది. రాత్రుళ్లు దీర్ఘంగా ఉంటాయి. ఇలా కదిలే క్రమంలో సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం అంటారు. సూర్య గమనం భూమధ్య రేఖకు ఉత్తరంగా ఆరు నెలలు, దక్షిణంగా ఆరు నెలలు అక్షాంశాలను బట్టి మారుతూ ఉంటుంది. కర్కాటక రేఖ మన దేశంలోని వింధ్య పర్వతాల మీదుగా వెళుతుంది. కర్కాటక సంక్రమణంతో దక్షిణాయనం ప్రారంభమ వుతుంది. సూర్యుడు భూమధ్య రేఖకు ఉత్తర అక్షాంశంలో సంచరించే ఆరు నెలలు ఉత్తరాయణం. ఇది దేవతలకు అత్యంత ఇష్టమైన కాలమని చెబుతారు. ఆధ్యాత్మికంగా, జ్యోతిష శాస్త్ర రీత్యా ఇది అద్భుతమైన రోజు. అందుకే స్వచ్ఛంద మరణాన్ని వరంగా పొందిన భీష్ముడు మహాభారత యుద్ధంలో క్షతగాత్రుడై ఉత్తరాయణ పుణ్యకాలం కోసం అంపశయ్య పై ఎదురు చూస్తూ మాఘ శుద్ధ అష్టమి



రోజు తనువు చాలించాడు. దేవతలకు మకర సంక్రమణంతో రోజు ప్రారంభ మవుతుందని చెబుతారు. బ్రహ్మాండంలో ఏదైతే ఉందో అండాండంలో కూడా అదే ఉంది. రెంటికి మధ్య సంబంధం తెగిపోతే మానవుడు గతి తప్పుతాడు. పరమాత్మ సర్వాంతర్యామి అన్న సంగతి గుర్తించి పూజలు చేయడం వలన సఫలం అవుతాం.



# ఢిల్లీలో మరోమారు వాయు కాలుష్యభయం

### కాలుష్యస్థాయి పెరిగిందన్న వాతావరణ శాఖ

**న్యూఢిల్లీ,జనవరి14(ప్రజామంటలు):** ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతూనే ఉంది. దేశరాజధానిలో గాలి నాణ్యత తీవ్రస్థాయిలో పడిపోతున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. తాజాగా ఢిల్లీలో శనివారం ఉదయం ఎయిర్ ఇండెక్స్ క్వాలిటీ (ఎక్యూఐ) 337గా నమోదైందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్ (ఎస్ఏఎఫ్ఏఆర్) సమాచారం ప్రకారం ఢిల్లీ యూనివర్సిటీ ప్రాంతంలో 357, పూసా టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో 329, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 326 గా ఎక్యూఐ నమోదయ్యాయి. అలాగే ఢిల్లీ ఐఐటి చుట్టుపక్కల ప్రాంతంలో 337, మధుర రోడ్‌లో 349, లోధి రోడ్ ప్రాంతంలో 327గా ఏక్యూఐ నమోదయ్యాయి. కాగా, ప్రస్తుతం ఢిల్లీలో శనివారం ఉదయం 11.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో అక్కడ చలిగాలులు వీస్తున్నట్లు ఐఎండి పేర్కొంది. రాబోయే రెండు రోజులు 15, 16 తేదీల్లో వాయువ్య భారతదేశంలో చలిగాలులు తీవ్రంగా వీచే అవకాశముందని, మరోసారి గరిష్టస్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది. జనవరి 15న పంజాబ్, చండీగఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురిసే అవకాశముందని ఐఎండి అంచనా వేసింది.

# వచ్చే ఏడాది జనవరిలో అయోధ్య దర్శనం

### శరవేగంగా పనులు సాగుతున్నాయి

### ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడి

**అయోధ్య,జనవరి14(ప్రజామంటలు):** యావత్తు భారత దేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో చేపట్టిన రామ మందిర నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఆలయం నిర్మాణానికి సంబంధించిన చాలా పనులు ఇప్పటికే పూర్తైనట్లు దేవాలయ నిర్మాణ



వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. ఈ ఏడాది చివరినాటికి పనులు పూర్తి చేస్తామని.. వచ్చే ఏడాది జనవరి నాటికి భక్తులకు శ్రీరాముడిని దర్శించుకునే భాగ్యం కల్పిస్తామని ఆయన వెల్లడించారు. సూర్యోదయ కిరణాలు విగ్రహంపై పడేలా గర్భగుడి రూపకల్పన చేసినట్లు చెప్పారు.ఈ రోజు దేశం మొత్తం లోహ్రీని జరుపుకుంటోంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. రామ మందిరాన్ని నిర్మించాలనే మా లక్ష్యంలో సగానికి పైగా సాధించాము. 2024లో సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సమయంలో.. గర్భగుడిలో శ్రీరాముడి విగ్రహాలను ప్రతిష్ఠిస్తాం. భక్తుల సందర్శనార్థం జనవరి 2024లో రామమందిరాన్ని ప్రారంభిస్తాం' అని ఆయన వెల్లడించారు. కాగా, ఆలయం గ్రౌండ్ ఫ్లోర్ పనులు ఇప్పటికే సగం దశకు చేరుకున్నాయని రాయ్ తెలిపారు. ఆగస్టు నాటికి గర్భగుడి కింది అంతస్తు పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు.

# 2024 ఎన్నికలు బిజెపికి అంత సులభంకాదు

### అధికారం కోల్పోయినా ఆశ్చర్యం లేదు

### కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,జనవరి14(ప్రజామంటలు):** 2024 లోక్సభ ఎన్నికలు బిజెపికి అంత సులభంకాదని, బిజెపి గతంలో లాగా సునాయసంగా గెలవలేదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో




బీజేపీ సీట్లు తగ్గుతాయని.. 2019 విజయాన్ని పునరావృతం కావడం అసాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏకు 50సీట్లు తగ్గుతాయని, కాలం కలిసిరాకపోతే అధికారం కోల్పోయే ఛాన్సుందని జోస్యం చెప్పారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పరిస్థితి కాస్త మెరుగ్గా ఉన్నా.. చాలా రాష్ట్రాలను ఆ పార్టీ కోల్పోయిందన్నారు. 2019లో హర్యానా, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని అన్ని లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలిచిన విషయాన్ని శశి థరూర్ గుర్తుచేశారు. బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఒక స్థానం మినహా మిగిలిన సీట్లను ఆ పార్టీ గెల్చుకుందని, పశ్చిమ బెంగాల్‌లోనూ 18 స్థానాల్లో విజయం సాధించిందని అన్నారు. 2024లో ఆ రాష్టాల్లో సేమ్ రిజల్ట్ రిపీట్ కాకపోవచ్చని శశిథరూర్ అభిప్రాయ పడ్డారు. ఆయారాష్ట్రాల్లో 50 సీట్ల వరకు తగ్గొచ్చని, అది విపక్షాలకు ప్లస్ అవుతుందని అన్నారు. బీజేపీ 250 స్థానాలకు పరిమితమై.. ఇతర పార్టీలు 290 స్థానాల్లో విజయం సాధించినా పరిస్థితి పరిస్థితి ఎలా ఉండబోతుందో చెప్పలేమని శశిథరూర్ అన్నారు. విపక్షాలు ఏకతాటిపైకి వస్తాయా లేక ఆ పార్టీల నుంచి 30 మందిని కమలదళం తమవైపు తిప్పుకుని కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందా అన్నది ఇప్పుడే చెప్పలేమని అన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 543 సీట్లకుగాను బీజేపీ 303 సీట్లు గెలుచుకోగా.. కాంగ్రెస్ 52 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది.

## స్వరాష్ట్ర కాంక్షను తెలంగాణ నరనరాన

# రగిలించిన వేదిక ఖమ్మం

### 1969 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రధాన కేంద్రం

### కేసీఆర్ ఆమరణ దీక్షకు వేదికైన ఖమ్మం

### మరో చరిత్రకు పోరుగడ్డ నాంది

### బీఆర్ఎస్ తొలి బహిరంగసభకు చురుగ్గా ఏర్పాట్లు

**హైదరాబాద్, జనవరి 14:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి పునాది రాయిపడ్డ ఖమ్మం గుమ్మం ఇప్పుడు జాతి ముఖచిత్రాన్ని మార్చే వేదిక కానున్నది. తెలంగాణ వాదానికి పరీక్షగా నిలిచిన చోటు ఇప్పుడు బంగారు భారతాన్ని కలగంటున్నది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈనెల 18న ఖమ్మం వేదికగా జాతి జీవనాడిని పరిరక్షించే మహోద్యమానికి శ్రీకారం చుట్టనున్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన తర్వాత సీఎం కేసీఆర్ తొలిసారిగా జాతిముందు తన అజెండాను ఆవిష్కరించనున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహా నలుగురు సీఎంలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్‌యాదవ్ ఈ బహిరంగ సభకు హాజరుకానున్నారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో ఏం చేయబోతున్నారు? ఖమ్మం బహిరంగ సభ ద్వారా ఏ కార్యాచరణను ప్రకటించబోతున్నారు? అన్న అంశాలపై ఆసక్తి, ఉత్కంఠ నెలకొన్నది.

#### తెలంగాణవాదం-ఖమ్మం

ఆధిపత్యం, వివక్ష, నిర్లక్ష్యం, అవమానాలకు గురైన తెలంగాణ బిడ్డలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలనే కాంక్ష 1956 నుంచి ఉందని ఖమ్మం నిరూపించింది. 1969 జనవరి 8న కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి ఖమ్మంలో డిగ్రీ విద్యార్థి రవీంద్రనాథ్ రెండు వారాలు ఆమరణ దీక్ష చేపట్టారు. దీనికి మార్గదర్శిగా కొలిశెట్టి రామదాసు వ్యవహరించారు. 18 నెలలపాటు టీఎన్జీవోలు, కార్మికులు, నిరుద్యోగుల ఆందోళనలు నిర్వహించిన తర్వాత విద్యార్థులు ఉద్యమంలోకి దిగారు.

#### బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు

టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన తర్వాత తొలిసారిగా ఈ నెల 18న ఖమ్మంలో పార్టీ నిర్వహించతలపెట్టిన బహిరంగసభ ఏర్పాట్లు వడివడిగా సాగుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి సీఎం కేసీఆర్‌కు వెన్నుదన్నుగా



నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సహా ఎమ్మెల్యేల నుంచి మొదలుకొని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు బహిరంగసభ విజయవంతానికి సన్నద్ధం అవుతున్నారు.

#### స్వరాష్ట్ర కాంక్షకు ముఖద్వారం

'కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో', 'కేసీఆర్ శవయాత్రో..తెలంగాణ జైత్రయాత్రో'..అంటూ స్వరాష్ట్ర కాంక్షను తెలంగాణ నరనరాన రగిలించిన వేదిక ఖమ్మం. ఇక్కడ తెలంగాణ వాదమేలేదని నీలిగినవాళ్లకు 'గిదిరా ఖమ్మం' అని నిరూపించిన నాయకుడు కేసీఆర్. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టకుండా కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అల్గునూర్ వద్ద ఆక్టోపస్ పోలీసులు అరెస్టు చేశారు. అత్యంత నాటకీయ పరిణామాల నడుమ ఆయనను ఖమ్మం తరలించి మున్సిఫ్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసీఆర్‌కు 14 రోజుల రిమాండ్ విధించడంతో సబ్ జైలుకు తరలించారు. 2009 నవంబర్ 30న ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడే 2 రోజులు ఆమరణ దీక్షను కొనసాగించారు. డిసెంబర్ 3న ఖమ్మం ప్రభుత్వ దవాఖాన నుంచి కేసీఆర్‌ను నిమ్స్‌కు తరలించేదాకా ఖమ్మంలో రాజుకున్న అగ్గి తెలంగాణ అంతటా పరివ్యాప్తమై డిసెంబర్ 9 ప్రకటనకు దోహదమైంది.

# బిజెపిని సాగనంపితేనే దేశానికి మేలు

### చారిత్రాత్మకం కాబోతున్న ఖమ్మం సభ

### - రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

**ఖమ్మం,జనవరి14(ప్రజామంటలు):** దేశ చారిత్రాత్మక సభకు ఖమ్మం వేదిక కావడం అదృష్టమని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 18న ఖమ్మం వేదికగా జరగబోయే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఉద్యమ పార్టీ నేడు జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని హరీశ్‌రావు తెలిపారు. నేడు తెలంగాణ ఆచరించింది.. రేపు దేశమంతా అనుసరిస్తోందన్నారు. మన మిషన్ భగీరథను కేంద్రం దేశమంతా విస్తరిస్తోందని తెలిపారు. మిషన్ కాకతీయను అమృత్ సరోవర్ పేరుతో అమలు చేస్తుందని చెప్పారు. రైతుబంధును కేంద్రం పీఎం కిసాన్ పేరుతో అమలు చేస్తుందని గుర్తు చేశారు. గ్రామాలకు అవార్డులు ఇస్తే 10కి పది తెలంగాణకే వచ్చాయన్నారు. మతతత్వ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని సూచించారు. మతతత్వ పార్టీలకు ఎవరైనా ఓటు వేస్తారా? అని



ప్రశ్నించారు. బీజేపీని సాగనంపితేనే ప్రభుత్వ రంగ సంస్థలకు మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో 18 లక్షల పోస్టులు ఖాళీలుంటే ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయడం లేదన్నారు. ఉద్యోగాలు ఇచ్చే భారత్ రాష్ట్ర



సమితి కావాలా.. ఉద్యోగాలు తీసేసే బీజేపీ కావాలా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# లక్షణంగా ఆయిల్‌పామ్..

### 8 జిల్లాలో జోరుగా సాగవుతున్న పంట

### కొత్తగా రెండు ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు

### పాతవి విస్తరణకు వేగంగా ఏర్పాట్లు

### 550 కోట్ల రూపాయల వ్యయం..

### మూడు వేల మందికి ఉపాధి

**హైదరాబాద్, జనవరి 14:** రాష్ట్రంలో పామాయిల్ దిగుమతులను తగ్గించేందుకు ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. పలురకాల సబ్సిడీలతో పాటు పండిన పంటను విక్రయించేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుండటంతో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నది. దీంతో ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ రాష్ట్రవ్యాప్తంగా పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల ఏర్పాటును వేగవంతం చేస్తున్నది. కొత్తగా రెండు ఫ్యాక్టరీల ఏర్పాటుతోపాటు ఇప్పటికే



ఉన్న రెండు పాత ఫ్యాక్టరీలను విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. నూతనంగా ఆయిల్‌పామ్ సాగవుతున్న సిద్దిపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ పెట్టుబడితో నూతన ఫ్యాక్టరీలను స్థాపించాలని నిర్ణయించింది. వీటివల్ల రైతులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరోవైపు ప్రైవేటు కంపెనీలు కూడా జిల్లాకొక ఫ్యాక్టరీ చొప్పున ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి.

#### 2025 కల్లా నూతన ఫ్యాక్టరీలు సిద్ధం

ఇప్పటికే ఆయా జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు జోరుగా సాగుతుండటంతో నాలుగేండ్లలో పంట ఉత్పత్తి ప్రారంభమవుతుంది. గెలలు వచ్చే సమయానికి రైతులకు ఇబ్బంది లేకుండా ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ఆయిల్‌ఫెడ్, ఇతర ప్రైవేటు కంపెనీలు ప్రయత్నాలు ప్రారంభించాయి. కొత్త ఫ్యాక్టరీల నిర్మాణానికి, పాత ఫ్యాక్టరీల విస్తరణకు ఆయిల్‌ఫెడ్ సుమారు రూ.550 కోట్లకుపైగా పెట్టుబడి పెట్టనున్నది. ఇందులో రూ.250 కోట్లతో సిద్దిపేట జిల్లాలో గంటకు 60 టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యంతో ఒకటి, రూ.150 కోట్లతో గద్వాల జిల్లాలో 30 టన్నుల సామర్థ్యం గల ఫ్యాక్టరీని 2025 కల్లా అందుబాటులోకి తెచ్చే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. రూ.25 కోట్లతో ప్రస్తుతం అప్పారావుపేటలో ఉన్న 45 టన్నుల ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 90 టన్నులకు పెంచనున్నారు. రూ.130 కోట్లతో ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో 30 టన్నుల ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 90 టన్నులకు పెంచనున్నారు. పాతవి, కొత్తవి కలిపి సుమారు 3వేల మందికి ఉపాధి లభించనున్నది.

#### కొత్తరకం టెక్నాలజీ

అత్యాధునిక సాంకేతికతతో నూతన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను నిర్మించనున్నారు. గతంలో ఉన్న ఫ్యాక్టరీలు భారీ విస్తీర్ణంలో ఉండటంతోపాటు పెట్టుబడి వ్యయం బాగా అయ్యేది. ఇప్పుడు నిర్మించేవి నిలువు పద్ధతిన ఏర్పాటు చేయనుండటంతో 70 శాతం స్థలం ఆదా కావడంతోపాటు 20 శాతం పెట్టుబడి ఖర్చు తగ్గనున్నది. ఇటీవలే ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం మలేషియాలో పర్యటించి అధ్యయనం చేసి వచ్చింది.

#### లక్ష ఎకరాలు దాటనున్న సాగు

ఒకప్పుడు వందల ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు ఈ ఏడాది మార్చి నాటికి లక్ష ఎకరాల మార్క్ దాటనున్నది. ప్రస్తుతం 8 జిల్లాల్లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో 58 వేల ఎకరాలు సాగు అవుతుండగా, 'మిషన్ ఆయిల్‌పామ్'లో భాగంగా గత డిసెంబర్ నాటికి 27 వేల ఎకరాలను సాగులోకి తెచ్చారు. తాజాగా మార్చి నాటికి మరో 23 వేల ఎకరాల సాగు అందుబాటులోకి రానున్నది. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో ఎప్పటి నుంచో సాగు చేస్తుండగా గద్వాల, నారాయణపేట, సిద్దిపేట, జనగామ, మహబూబాబాద్, యాదాద్రి-భువనగిరి జిల్లాల్లో కొత్తగా సాగు మొదలుపెట్టారు.

#### గెలల ధర అదరహో

ఆయిల్‌పామ్ గెలల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. గత సెప్టెంబర్‌లో టన్నుకు రూ.16 వేలకు పైగా పలకగా అక్టోబర్‌లో రూ.12,996కి పడిపోయింది. నవంబర్, డిసెంబర్ నెల నుంచి మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. నవంబర్‌లో టన్నుకు రూ.13,741, డిసెంబర్‌లో రూ.13,881 పలికింది. గతేడాది జూన్‌లో రికార్డుస్థాయిలో టన్ను గెల రూ.23,467 పలకడం విశేషం.

## బ్రాహ్మణ ఫోరం ఆవిర్భావం

**నల్లకుంట, జనవరి 14 :** రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజిక వర్గంపై దాడులు చేస్తూ కించ పరుస్తున్న పరిస్థితుల నేపథ్యంలో వాటిని ఎదుర్కోవడానికి, న్యాయపరంగా పోరాడటానికి చింతపల్లి మంగపతిరావు, దర్శనం శర్మ, మృత్యుంజయ శర్మలతో కూడిన బ్రాహ్మణ ఫోరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ భవన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిప్రసాద్ శర్మ వెల్లడించారు. ఆయన శనివారం హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఫోరంలో 20 మంది ప్రతినిధులతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఉంటారని తెలిపారు.

## నిమ్స్‌లో బాలింతలను పరామర్శించిన హరీశ్

**హైదరాబాద్, జనవరి 14:** నిమ్స్ ఆస్పత్రితో చికిత్స పొందుతున్న 8 మంది బాలింతలను వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ పరామర్శించారు. మలక్‌పేట ప్రభుత్వ ఆస్పత్రిలో 11 మందికి సిజేరియన్ జరుగగా.. అందులో ఇద్దరు బాలింతలు మృతి చెందిన విషయం తెలిసిందే. మిగతా 9మంది బాలింతలను మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా.. శనివారం రాత్రి మంత్రి హరీశ్ ఎలాంటి కాన్వాయ్ లేకుండా, వైద్యాధికారులకు సమాచారం ఇవ్వకుండా నిమ్స్‌కు వచ్చి బాలింతల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.






### అనాధల మధ్య సంక్రాంతి
# పండుగ వేడుకలు


**సికింద్రాబాద్ జనవరి 14 (ప్రజామంటలు):** ఏ పండుగలను జరుపుకోలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్న రోడ్డు పక్కన అనాధలకు తాము అండగా



ఉన్నామంటూ పద్మారావునగర్ కు చెందిన స్కై ఫౌండేషన్ నిర్వహకులు ముందుకొచ్చారు. మీకు మేము ఉన్నామంటూ సిటీలోని పలు ప్రధాన రహదారుల ఫుట్ పాత్ లపై నివసిస్తున్న వారి మధ్య సంక్రాంతి పండుగ వేడుకలను జరుపుకున్నారు. వారికి దుస్తులు, స్నాక్స్ ప్యాకెట్లను అందచేశారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు పక్కన అనాధలను జీవనోపాధి కల్పించి, వారికి కొత్త జీవితాన్ని అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని లు పాల్గొన్నారు.

### ఎస్టీ యూనియన్ ఇన్చార్జిగా
# జరుపుల రమేష్ నాయక్


**మల్లాపూర్ జనవరి 14 (ప్రజామంటలు):** కోరుట్ల నియోజకవర్గ ఎస్టీ యూనియన్ ఇన్చార్జిగా జరుపుల రమేష్ నాయక్ నియమితులయ్యారు. జరిగిన సమావేశంలో నియామక పత్రాలు అందజేసినట్లు రమేష్ నాయక్ తెలిపారు. ఎస్టీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నునా వత్ దేవదాస్ నాయక్ చేతుల మీదుగా నియమక పత్రాలని అందుకున్నారు. రమేష్ నాయక్ మాట్లాడుతూ.... అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామన్నారు. తెలంగాణ గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడం అన్ని వర్గాలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, సభ్యులు, గిరిజన సోదరులు తదితరులు పాల్గొన్నారు.




### 'చెట్టు' ను మనిషి కాపాడితే
# 'మనిషిని' చెట్టు కాపాడుతుంది

**జన్నపనేని సురేందర్ రెడ్డి**

**హుస్నాబాద్ జనవరి 14 ( ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం కొత్త కొండ గ్రామంలో జన్నపనేని సురేందర్ రెడ్డి భక్తులకు ఆలయ అవరణలో 6వ సంవత్సరం ఏర్పాటు చేసిన వృక్ష ప్రసాదం పంపిణీ చేశారు.



అనంతరం శ్రీ వీరభద్ర స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జేఎస్ఆర్ మాట్లాడుతూ.... నేడు భక్తులు మొక్కలను దైవ ప్రసాదంగా స్వీకరిస్తున్నారని, గతంలో భక్తులు స్వీకరించిన వృక్ష ప్రసాదం నేడు పలం రూపంలో భక్తులు స్వామి వారికి ప్రసాదంగా అందించడం జరుగుతుందని గొప్ప విషయం అని అన్నారు. ఈ సంవత్సరం జామ,మామిడి మొక్కల్ని భక్తులకు ప్రసాద రూపంలో అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం ఇవాళ రేపు జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వృక్ష ప్రసాదం స్వీకరించాలని కోరారు.

### ఎస్.సి. కార్పొరేషన్ నిధులను
# వెంటనే విడుదల చేయాలి

**జనసేన పార్టీ కో ఆర్డినేటర్ జనార్దన్**


**జగిత్యాల జనవరి 14 (ప్రజామంటలు):** అర్హులైన ఎస్.సి. లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాల నిధులను వెంటనే విడుదల చేయాలని జనసేన జగిత్యాల నియోజకవర్గ కో ఆర్డినెటర్ బెక్కం జనార్దన్ కోరారు. శనివారం జగిత్యాలలో విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సిలలోని అర్హులకు స్వయం ఉపాధి రుణాలను ఇస్తుందన్నారు. గత ఏడాది కాలంగా నిధుల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం కారణంగా నిరుద్యోగ ఎస్సిలకు నష్టం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబందు పతకాన్ని జనసేన స్వాగతిస్తోందని జనార్దన్ అన్నారు. నిరుద్యోగ ఎస్.సి. యువకులు అప్పులు తెచ్చి వ్యాపారం నిర్వహిస్తున్నారని తెచ్చిన అప్పులకు వడ్డీలను కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సత్వరమేప్రభుత్వ నిధులను విడుదల చేసి ఎస్.సి. యువకులకు స్వయం ఉపాధి రుణాలను మంజూరు చేయాలని జనసేన జగిత్యాల నియోజకవర్గ కో ఆర్డినెటర్ బెక్కం జనార్దన్ కోరారు.



# శ్రీ వాల్మీకి మహర్షికి అక్షర కుసుమాంజలి

**( పుస్తక సమీక్ష )**

ఆసేతు హిమాచలం ఆదికవి వాల్మీకితో అనుబంధమే! తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా వల్మిడి గ్రామం అందులో ఒకటి. వాల్మీకిపురం కాలక్రమంలో వల్మిడి అయ్యింది. వల్మిడిలో వాల్మీకి ఆశ్రమము, తపమాచరించిన గుహ ఉన్నాయి. ఈ ఆశ్రమములోనే సీతమ్మకు ఆశ్రయం ఇచ్చిందని ప్రతీతి. వల్మిడి గురించి ఆకుల పుల్లయ్య, వీరమల్ల సోమదేవ రాజు గ్రంథాలు వ్రాసినరు. ఆ కోవలో వేముల శ్రీ వేమన శ్రీ చరణ్ సాయి దాస్ సంపాదకత్వంలో వెలువడిన "శ్రీ వాల్మీకి మహర్షికి అక్షర కుసుమాంజలి" సంకలనము విలక్షణమైనది, విశిష్టమైనది. ఇందులో 102 కవులతో వ్రాయించిన కవితలు ఉన్నాయి. వల్మిడి గురించి, వాల్మీకి గురించి, రామాయణం గురించి వైవిధ్యమైన వ్యక్తీకరణలు గ్రహించవచ్చు. వేముల శ్రీ సహస్రాధిక పద్యాలు వ్రాసిన కవి. అయినా శతాధిక కవులతో ఈ సంకలనం వెలువరించి పుణ్యాన్ని అందరికి పంచినరు. వేముల శ్రీ వక్కాణించినట్లు "వాల్మీకి జీవితం వసుదైక శాశ్వతం". అటువంటి వాల్మీకి మీద వెలువరించిన ఈ సంకలనం కూడా శాశ్వతత్వాన్ని సంతరించు కొన్నది అనుటలో సందేహం లేదు. వేముల శ్రీ వేమన శ్రీ చరణ్ సాయి దాస్ 2020 సంవత్సరం తన సాహిత్య పర్యటనలో బమ్మెర, పాలకుర్తి, వల్మిడి గ్రామాలను సందర్శించినరు. అప్పుడు తనకు కలిగిన సంకల్పంతో పోతన, సోమన, వాల్మీకి మీద కవితా సంకలనాలు వెలువరించినరు. ఆ వరుసలో భాగమే ఈ సంకలనం. జనగామ కవిత్రయం, తను పొందిన "మణిపూసల వేమన" బిరుదులోని వేమనను కలుపుకొని "వాల్మీకి సోమన పోతన వేమన సాహిత్య వేదిక" ను నెలకొల్పి సాహిత్య సేవ చేస్తున్నడు. అంతకు ముందు "శ్రీ సాయి సరస్వతి విద్యా వికాస్" సంస్థ ద్వారా విద్యా వ్యాప్తి కార్యక్రమాలు చేసేవాడు. ఈ సంకలనంలోని ప్రతి కవితా ప్రత్యేకమైనదే! అంశాలు అక్కడక్కడ పునరుక్తమైనా పునః పునః రసానుభూతి పొందవచ్చు. ఎవరి వ్యక్తీకరణ వారిదే కదా! కవులు తమ కవిత్వాన్ని వచనం, పద్యం, పాట, మంగళహారతి వంటి అనేక రూపాలలో ప్రకటించినరు. మణి పూసలు, మంజరీ రుద్రాక్షలు వంటి ఆధునిక ఛందో ప్రయోగాలు కూడా ఇందులో ఉన్నాయి. గంట ఐశ్వర్య రెడ్డి ఉటంకించినట్లు "వాల్మీకిదే నామ భువిఖ్యాతం భవిష్యసి" అన్న సప్తర్షుల పలుకులు రామాయణ రచన వలన శాశ్వతమై నిలిచినయి. సత్య మొండ్రేటి రామాయణంలోని సప్త కాండలను ఇంద్రధనుస్సు లోని సప్త వర్ణాలుగా అభివర్ణించింది. కళ్లెం లక్ష్మణ్ ప్రతి కాండం అమృత భాండం అంటడు. తెప్పల కృష్ణమూర్తి అన్నట్లు రామాయణం పారాయణ గ్రంథమే కాదు, ఆచరణ ప్రధాన మహా గ్రంథం. రామాయణాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా భావిస్తరు. ఎన్నవెల్లి రాజమౌళి రామాయణమే దేవాయణం, మాడుగుల మురళీధర శర్మ శ్రీరామచంద్రుని సీత చరిత అంటె, కుసునూరు భద్రయ్య రావణ కుంభ కర్ణాదుల శాపము తొలగ జేసిన తొల్లి గాథ అంటడు. మూర్తీభవించిన ధర్మమూర్తి "శ్రీరాముడి జీవనయానమే రామాయణం" అంటడు గజవెల్లి సత్యనారాయణ స్వామి. రామాయణాన్ని "వినినంతనే కల్గు పూర్ణ విశ్వ జ్ఞానంబు" అంటడు






రాయబారపు అశోక్. వాల్మీకి వేయి శ్లోకాలకు ఒకసారి బీజాక్షరాలను నిక్షిప్తం చేసిన విషయాన్ని లోడె రాములు గుర్తు చేస్తే, రామాయణాంతర్గతంగా ఆదిత్య హృదయం, వెంకటేశ్వర సుప్రభాతానికి పల్లవి పదాలైన కౌసల్యా సుప్రజా రామా, దేశభక్తి ప్రబోధకమైన జననీ జన్మభూమిశ్చ వంటి మరెన్నో అంశాలను పలువురు కవులు ప్రస్తావన చేసినరు. "పాపాత్ముని ఎదిరించ పక్షియైతే నేమి/ వారధిని కట్టుటకు వానరులైతే నేమి?!" అంటూ రామాయణంలోని సందేశాలను అర్థం చేయిస్తడు వడ్డేపల్లి నర్సింగరావు. రామాయణ కథకు వాల్మీకి రచయితయే కాదు, కథలో పాత్రధారి కూడా! తంగెళ్ల అనందాచారి అంటడు: నడుస్తున్న కథలో తనూ నాయకుడాయే/ నిండు గర్భిణి జానకికి జనకుడుగ మారే – అని. రామసతికి వనమున కొండంత అండగ/ రామసుతులకు తాతగ... అంటూ వి సుబ్రహ్మణ్య హరగోపాల్ చెప్పుతడు. దీనినే మంద వీరస్వామి గౌడ్ తన పాటలో ప్రస్తావిస్తడు: సీతమ్మను అడవికంప ఆశ్రయమును ఇచ్చినాడు/ సీతాసుతులకు విద్యా బుద్ధులు బోధించినాడు – అని. వాల్మీకి "మహిని కవుల కెల్ల మార్గదర్శి యగుచు" ఆదికవిగ నిలిచిన విషయాన్ని బల్లూరి ఉమాదేవి వ్రాస్తే, "ధర్మ వర్తనులను పేరు దద్దరిల్ల/ భారతీయుల కీర్తిని ప్రభల జేసె/ అట్టి కవిరాజు వాల్మీకి నభినుతింతు" అని నుతిస్తడు కర్నాటి రఘురాములు గౌడ్. "మనుజుడే భువియందు మనికి యుండిన దాక/ వాల్మీకి జీవించు ప్రతి యెదదను" అని చిరస్థాయిత్వాన్ని కీర్తిస్తది రాపోలు అరుణా స్వామి. "... శ్రీరామ చరితము నింపు గాను/ వ్రాసి తరియించె వాల్మీకి వాసి కెక్క" అంటడు మాచర్ల మల్లేశం. దోకురు రాములు వ్రాసిన "ఓం ఓం వాల్మీకి" పాట భక్తి పారవశ్యాన్ని కలిగిస్తది. ఈ పాట మరియు మోకాటి సంతోష్ కుమార్ వ్రాసిన "మంగళ మిదిగో ఓ మహర్షి శ్రీ వాల్మీకి మంగళ మిదిగో" మంగళహారతి వాల్మీకి జయంతి వంటి సందర్భాలలో పాడుకొనుటకు అనువుగ ఉన్నాయి. ఇందులో వల్మిడి ఊరు గురించి కూడా ప్రస్తావనలు ఉన్నాయి. వరుకోలు లక్ష్మయ్య "వాసిగ ఋషివర్యుడీ సీమలో దిర్గ/ వల్మిడి పురమౌచు వాసిగాంచె" అంటడు. రసన "వాల్మీకి అలనాడు వాసముండిన ఊరు", కొండ మోహన్ "మా ఊరు వల్మిడి మా గురువు వాల్మీకి", చెరుకు రాములు ఊరి శివారులో ఉన్న ఏడు గుట్టల పేర్లు తెలుపుతూ "ఏడుకొండల వల్మిడి", కూటికంటి సోమయ్య "వాసిగా వాల్మీకి వన్నె తెచ్చిన జిల్లా" అంటరు. ఇంక సంకలనకర్త గురించి "వాల్మీకి కవితలు వాసిగా ముద్రించి/ వల్మిడి గ్రామాన వాసి గాంచె" అంటుంది ఏలూరు ధర్మావతి. "సాధు శీలుడైన సాయి చరణదాసు/ పుస్తకమ్ము దీసె పుణ్యమూర్తి" అంటడు విజయ కుమార్ ఎల్లంభట్ల. అదే పద్యంలో ముగింపు పాదం "వల్మిడి పుర వాస వరద రామ" చూస్తే, ఈ మకుటంతో విజయ కుమార్ భవిష్యత్ లో శతకం వ్రాస్తడు అనిపించింది. లింగంపల్లి రామచంద్ర, ఐత చంద్రయ్య, టి గౌరీశంకర్, కుప్ప వాసుదేవ శాస్త్రి, రాపోలు సత్యనారాయణ, ఉంద్రాళ్ల రాజేశం, ఎన్నవెళ్ళి రాజమౌళి, వరుకోలు లక్ష్మయ్య, మదునూరి సూర్యనారాయణ శర్మ వ్రాసిన ముందుమాటలు సంకలన విశేషాలను విశదీకరిస్తున్నయి. ఆదికవి వాల్మీకికి అందమైన అక్షర కుసుమాంజలి అందించిన వేముల శ్రీ అభినందనీయుడు!

**ప్రతులకు:**

శ్రీ వాల్మీకి మహర్షికి అక్షర కుసుమాంజలి – సంకలనము,
సంపాదకుడు: వేముల శ్రీ వేమన శ్రీ చరణ్ సాయి దాస్,
ప్రచురణ: వాల్మీకి సోమన పోతన వేమన సాహిత్య వేదిక మరియు శ్రీ సాయి సరస్వతి విద్యా వికాస్, నంగునూర్, సిద్ధిపేట,
పుటలు: 108, వెల: రూ. 121
ఫోన్: 9652256429

**సమీక్షకులు:**
**డాక్టర్ రాపోలు సత్యనారాయణ**
**9440163211**

# ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ కప్ విజేత: పోలీస్ శాఖ

**రన్నరఫ్‌గా ప్రెస్ టీమ్**

**చిగురుమామిడి జనవరి 14 (ప్రజామంటలు):** సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని శనివారం చిగురుమామిడి ఎస్సై దాస సుధాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఫ్రెండ్లీ





క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. మండలంలోని ప్రెస్, పోలీస్, రాజకీయ నాయకులు వేర్వేరు టీములుగా ఏర్పడి ఈ క్రికెట్ మ్యాచ్ లో పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ లో పోలీస్ శాఖ విజయం సాధించింది. విన్నర్ పోలీస్ టీమ్.. రన్నర్ ప్రెస్ టీమ్ లకు మెమొంటోలు అందజేశారు. అత్యధికంగా రన్స్ తీసిన చిగురుమామిడి నాయబ్ తహసీల్దారు రవికుమార్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ను చిగురుమామిడి, మానకొండూరు ఎస్సైలు దాస సుధాకర్, తిరుపతి అందించారు. ఈ సందర్భంగా చిగురుమామిడి ఎస్ఐ దాస సుధాకర్ మాట్లాడుతూ.... పోలీస్ శాఖ, పొలిటిషన్, మీడియా కలిసి స్నేహపూర్వకంగా ముందుకు వెళితే కష్టంలో ఉన్న ప్రజలకు, ఇబ్బందులు ఉన్న వారికి వెన్నుదన్నుగా నిలవొచ్చన్నారు. అలాగే మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లే వీలవుతుందన్నారు. ఇలాంటి మ్యాచ్‌ల ద్వారా క్రీడాకారుల ప్రతిభను బయటకు తీసుకురావడమే కాకుండా.. ఆటవిడుపుగా ఉంటుందనే ఉద్దేశంతో గత సంవత్సరం, ఈ సంవత్సరం కూడా క్రికెట్ మ్యాచ్ నిర్వహించామని వెల్లడించారు. ఫ్రెండ్లీ కప్ నిర్వహణకు సహకరించిన అందరికీ ఎస్ఐ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పోలీసులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మాదం బిక్షపతి కుటుంబాన్ని ఆదుకోవాలి

**జిఎంపిఎస్ డిమాండ్**

**ఎల్కతుర్తి జనవరి 14 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన మాదం బిక్షపతి చెందిన గొర్రెలు చనిపోయి తీవ్రంగా నష్టపోయిన మాదం బిక్షపతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల రమేష్ జిల్లా కమిటీ సభ్యులు ఎల్లా బోయిన రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గొర్రెలు చనిపోయి నష్టపోయిన మాదం బిక్షపతి కుటుంబాన్ని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం.(జిఎంపిఎస్) హనుమకొండ జిల్లా ప్రతినిధి బృందం పరామర్శించారు. గొర్ల చనిపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే గొర్రెలు మేకల పెంపకం దార్ల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలరాజు స్థానిక ఎమ్మెల్యే వోడిదల సతీష్ బాబు. పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కెవి నారాయణ గారి ఫోన్లో వివరాలు తెలియజేశారు వారు సానుకూలంగా స్పంది%శీ%చారు. అనంతరం కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ.... తరతరాలుగా గొర్రెలు మేకల పెంపకం వృత్తిపై ఆధారపడి తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం ఉదయం రోజువారీగా తమ గొర్రెల మేత కోసం బయటికి తోలుకుపోయారు. గొర్రెలు మేస్తున్న సమయంలో కాజీపేట నుండి బల్లర్షా



వైపువెళ్లే దానాపూర్ ఎక్స్ ప్రెస్ రైలు ఢీకొని 65 గొర్రెలు చనిపోయి సుమారు 6 లక్షల రూపాయలు నష్టం జరిగింది. నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు రవి, వి. రాజు తదితరులు జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల రమేష్, 7396481923 ఒక ప్రకాటంలో తెలిపారు.

### స్వామి వారిని దర్శించుకొన్న జడ్జి భూపతి

**ధర్మపురి జనవరి 14 (ప్రజామంటలు):** రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ %ిడ% సెషన్స్ జడ్జి సిహెచ్ కె. భూపతి కుటుంబ సమేతంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం సాంప్రదాయం ప్రకారం మేళ తాళాలతో స్వాగతం పలికి పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి, శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం ఇచ్చి సన్మానించారు.



### క్రీడలు మానసిక, శారీరక
# ఎదుగదలకు తోడ్పడుతాయి

**సీ.ఐ. బొల్లం రమేష్**

**హుజూరాబాద్ జనవరి 14 (ప్రజామంటలు):** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని హుజురాబాద్ టౌన్ సిఐ బొల్లం రమేష్ అన్నారు. శనివారం హుజురాబాద్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వన్డే టోర్నమెంట్ ఫెస్టివల్ కప్ టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నమెంట్ లో భూపాలపల్లి, వరంగల్, కరీంనగర్, హుజురాబాద్





జట్లు పాల్గొన్నాయి. హాకీ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో హాకీ క్లబ్ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిదులుగా హుజరాబాద్ పట్టణ సీఐ బొల్లం రమేష్, రూరల్ సిఐ జి జనార్ధన్ లు పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. కాగా ఈ వన్డే హాకీ టోర్నమెంట్ లో భాగంగా జరిగిన పోటీలలో హుజురాబాద్ హాకీ జట్టు వరంగల్ జట్టుపై విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో హాకీ క్లబ్ గౌరవ అధ్యక్షులు తోట రాజేంద్రప్రసాద్, గుడ్డెలుగు సమ్మయ్య, చింత శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, వేముల రవికుమార్ మరియు కార్యదర్శి జి. ఉమామహేశ్వర్, భూసారాపు శంకర్, ఎండి. సాజిత్, టి. శ్రీనివాస్, బి. తిరుపతి, టి. కుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# పిల్లలకు భోగి పండ్లు

**జనగామ జనవరి 14 (ప్రజామంటలు):** జనగామ జిల్లా గుండ్లగడ్డ కాలనీలో నివసించే శంకర్, రేణుక దంపతుల మనుమడు, మనవరాలు విగ్నేష్ పటేల్, పార్వతి పటేల్ పిల్లలకు భోగి పండ్లు పోశారు. భోగి పండ్లు పిల్లలకు పోయడానికి ముఖ్య కారణం భోగి నాడు చిన్నపిల్లలకు భోగి పండ్లు పోసే



సంప్రదాయం ఉన్నది. ఈ సంప్రదాయం వెనుక ఆరోగ్యకరమైన కారణం కూడా ఉంది. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం. రేగు పండ్లను తల మీద పోయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోయి నారాయణుడి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. తల పైభాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దాన్ని ప్రేరేపితం చేస్తే, పిల్లల్లో జ్ఞానం పెరుగుతుందని ఒక నమ్మకం. రేగుపండ్లు, చెరకు గడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణేలను భోగి పండ్లుగా వాడతారు. రేగు పండ్లకు బదరీఫలాలని పేరు. శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నర, నారాయణులు బదరికావనంలో తపస్సు చేస్తుండగా, వారి తలల మీద దేవతలు బదరీ ఫలాలను కురిపించారట. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగి పండ్లను పోసే సంప్రదాయం ఏర్పడిందని చెబుతారు. ఎరుపు రంగులో ఉండే రేగు పండ్లను సూర్యుడికి ప్రతీకగా భావిస్తారు. అలా ఆదిత్యుడి ఆశీస్సులు పిల్లలకు లభిస్తాయని భోగిపండ్లు పోస్తారు.

## ఒక్కడు... విశ్వనాథ.....

# చిత్ర లోగో ధర్మపురిలో ఆవిష్కరణ

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

**ధర్మపురి జనవరి 14 (ప్రజామంటలు):** ఒక్కడు విశ్వనాథ సినిమాను సమర్పిస్తున్న నిర్మాణ సంస్థ యెక్క లోగో ను చిత్ర బృందం.. జనవరి 14 న శనివారం రాష్ట్రం లోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ధర్మపురి లో ఆవిష్కరించారు. ఆనంద రాగ తాళం ఆర్ట్స్ మరియు మార్కండేయ మూవీ మేకర్స్ సయుక్త



నిర్మాణ సారథ్యంలో తెరకెక్కనున్న ఈ దృశ్య కావ్యము రెండు రోజులలో మలి షెడ్యూల్ లో రెండవ రోజు...షూట్ ను చతుశ్శాల భవంతి లో ఏర్పాటు చేశారు సన్నివేశాలను చిత్రీకరించారు. విశ్వనాథ సత్యనారాయణను చూడడానికి ఒక వ్యక్తి రావడం వారిద్దరి సంభాషణలను చిత్రీకరించారు. దర్శకుడు..కార్తికేయ శక్తిధర్ కుడారై ఈ సందర్భంగా చిత్రాన్ని నిర్మిస్తున్న ఆనంద రాగ తాళం ఆర్ట్స్ యొక్క లోగో ను స్థానిక బ్రాహ్మణ మహిళ చేత ఆవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత శ్వేతా రాళ్ళబండి, బొజ్జా రాజగోపాల శర్మ, దేవస్థానం మాజీ చైర్మన్ సంగన భట్ల దినేష్ శర్మ, జనమంచి నర్సయ్య శర్మ, పెండ్యాల చంద్రశేఖర్ శర్మ, పెండ్యాల రాజేష్ శర్మ, సంగన భట్ల పెద్ద నరేందర్, మధు శంకర్, జనమంచి కిష్టయ్య, అన్నపూర్ణ, పార్వతి, స్థానిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు. శిష్య బృందం గా నటించారు. ఒక్కడు విశ్వనాథ..వెబ్ సిరిస్...త్వరలో వెబ్ సీరీస్ కోసం రూపు దిద్దుకుంటున్నట్లు, దీనిలో సుప్రసిద్ధ నటులు: చంద్రమోహన్, శుభలేఖ సుధాకర్ ప్రభృతులు నటించనున్న ఈ చిత్రానికి యస్.పి. శైలజ సంగీతం అందిస్తున్నట్లు దర్శకుడు కార్తికేయ శక్తిధర్ కుడారై తెలిపారు.

# టీటీడీకి రూ.80 లక్షల విలువైన లారీలు విరాళం

**తిరుమల జనవరి 14 (ప్రజామంటలు):** తిరుమలలో శ్రీవారి సేవకు గాను టీవీఎస్ సంస్థ రెండు లారీలను విరాళంగా అందజేసింది. సంస్థ వైస్ ప్రెసిడెంట్




చెన్నైకి చెందిన సెల్వం ఏసీ సౌకర్యంతో కూడిన రెండు కూరగాయల లారీలను శనివారం టీటీడీ ఈవో ధర్మారెడ్డికి అందజేశారు. ఈ వాహనాల విలువ రూ.80 లక్షలని దాత తెలిపారు. ముందుగా శ్రీవారి ఆలయం ఎదుట కొత్త వాహనాలకు పూజలు నిర్వహించిన లారీ తాళం చెవులను ఈవోకు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ అన్నప్రసాద కార్యకలాపాలకు కూరగాయలను తీసుకెళ్లేందుకు ఏసీతో ఈ వాహనాలను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. దాతలకు శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఇ జానకిరామిరెడ్డి పాల్గొన్నారు

# మాస్టర్ ప్లాన్‌లో 'సెంటు భూమి రైతులది పోనివ్వ'

**మాస్టర్ ప్లాన్ ముసాయిదా రద్దు చేయిస్తా**

**ఎమ్మెల్యేగా నేనే బాధ్యత వహిస్తా**

**అవసరమైతే ప్రభుత్వ భూముల్ని ప్లాన్ లో చేరుస్తా**

**ఉనికి కోసమే ప్రతిపక్షాల ఆరాటం**

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల జనవరి 14 ( ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ మాస్టర్ ప్లాన్ తో ఏ ఒక్క రైతుకు నష్టం కలగకుండా చూస్తానని, ముసాయిదా రద్దు చేయిస్తానని, రైతుల సెంటు భూమి పోనివ్వనని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 20 ఏండ్లకోసారి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిస్తుందని ఆ దిశలోనే ఓసంస్థ సర్వే చేసిందని ఎమ్మెల్యే చెప్పారు. మాస్టర్ ప్లాన్ రూపొందించడంలో కొందరు అధికారుల పొరపాటు జరిగిందన్నారు. ఇది కేవలం ముసాయిదా మాత్రమేనని ఇందులో మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. అభ్యంతరాలకు 60 రోజుల టైం ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయ అవకాశవాదులు తమ పబ్బం గడుకోవడానికి రైతులను రెచ్చగొడుతున్నారని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. రైతులది సెంటు భూమి పోనివ్వనని హామీ ఇస్తున్నామని ఎమ్మెల్యే న్నారు. అవసరమైతే ముసాయిదాను రద్దు చేయిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి అన్నట్లుగా నేనే బాధ్యత వహిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. గత కాంగ్రెస్ హయాంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ తప్పుల తడకగా మార్చారని దీనితో ఎందరికో ఇంటి అనుమతులు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. కొందరు ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా చేయాలంటూ రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై మేము మీలాగా ప్రజలను రెచ్చ గొట్ట లేదని ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. మాస్టర్ ప్లాన్ జాబితాలో ప్రజల అభ్యఅంతరాలను 60 రోజుల వరకు సేకరించి జాభితాగా తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులను మరిచిపోయారని రాజకీయ నిరుద్యోగులుగా మారారని నిత్యం పేపర్లో, టీవీల్లో కనిపించేందుకు తహతహలాడుతారని వీళ్ళతో ప్రజలకు మేలు ఏమి జరగదని అందులో జీవన్ రెడ్డి ఒకరని ఎమ్మెల్యే సంజయ్ చెప్పారు. జగిత్యాల శివారు గ్రామాలను మునిసిపల్లో చేర్చాలని ప్రతిపాదనలు




వచ్చాయని కానీ తాను ఒప్పుకోలేదన్నారు. కోరుట్ల, మెట్ పెల్లి, వేములవాడ, సిరిసిల్ల మునిసిపల్ చుట్టుపక్కల గ్రామాలు చేర్చారన్నారు. పంచాయతీ లు ఉంటేనే స్వయం పరిపాలన ఉంటుందన్న అభిప్రాయం తనదని ఎమ్మెల్యే చెప్పారు. మాస్టర్ ప్లాన్ లో రైతుల సెంటు భూమి పోనివ్వనని ఇది నేను ఇస్తున్న హామీ అని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చెప్పారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు బొడ్ల జగదీష్, అల్లే గంగా సాగర్, అవారి శివకేసరి బాబు, నాయకులు వొళ్ళం మల్లేశం, సింగారావు, వల్లెపు మోగిలి, బీ.ఆర్.ఎస్. పట్టణ అధ్యక్షులు గట్టు సతీష్ తోపాటు పలువురు ఉన్నారు.

# తలసేమియా పేషంట్లకు అరుదైన సర్జరీలు

**పేషంట్ల బాడీ నుంచి భారీ ప్లీహం తొలగింపు**

**ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్లు, మందులు**

**గాంధీ దవాఖాన సర్జరీ డాక్టర్ల ఘనత**

**సికింద్రాబాద్ జనవరి 14 (ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో వైద్యులు అరుదైన సర్జరీ చేసి తలసేమియా పేషంట్ల వ్యాధి తీవ్రతను తగ్గించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోల్కొండ కు చెందిన అహ్మద్ (29) గత 10 ఏండ్ల నుంచి తలసేమియా ఇంటర్మీడియా





వ్యాధితో బాధపడుతున్నారు. శరీరంలోని ప్లీహం పరిమాణం భారీగా పెరగడంతో ప్రతి వారం రక్త మార్పిడి చేయించాల్సి వచ్చేది. దాంతోపాటు అనేక ఇతరత్రా ఆరోగ్యసమస్యలు ఎదుర్కొన్నాడు. ప్రతి వారం రక్త మార్పిడి ఇబ్బందిగా మారడంతో చివరికి తలసేమియా, సికిల్ సెల్ అనీమియా సొసైటీ నిర్వాహకులను సంప్రదించాడు. సొసైటీ నిర్వాహకులు పలు మార్లు గాంధీ ఆసుపత్రి వైద్య నిపుణులతో చర్చించి, ఇటీవల ఇటీవల పేషంట్ అహ్మద్ ను గాంధీ సర్జికల్ వార్డులో అడ్మిట్ చేశారు. అనేక వైద్యపరీక్షల అనంతరం సర్జరీ డిపార్ట్ మెంట్ వైద్య బృందం ప్రధాన శస్త్రచికిత్స వైద్యులు డా. సద్గుణా చారి ఆధ్వర్యంలో లాప్రోస్కోపిక్ ప్లీనెక్టమీ సర్జరీని విజయవంతంగా చేసి, భారీ ప్లీహాన్ని తొలగించారు. అలాగే వంశపారంపర్య స్పిరోసైటోసిస్ తో బాధపడుతున్న సమ్రీన్ బెగమ్ (22) కు కూడ ఇలాంటి ప్లీహం ఆపరేషన్ ను సక్సెస్ గా నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాతో మాట్లాడుతూ...తలసేమియా పేషంట్లకు సర్జరీ లు చేయడం క్లిష్టతరమని, అందులోను ప్లీహం తొలగించడం, లాప్రోస్కోపిక్ ద్వారా సర్జరీ చేయడం చాలా అరుదు అని అన్నారు. ఈ పద్ధతి వలన సర్జరీ సమయంలో చాలా తక్కువ రక్తస్రవం జరగడం, తొందరగా రోగి కోలు కోవడం జరుగుతుందన్నారు. గాంధీ సర్జరీ డాక్టర్లు చాలా విజయవంతంగా ఆపరేషన్లను నిర్వహించారని అభినందించారు. సర్జరీ లు జరిగిన ఇద్దరు పేషంట్లు ప్రస్తుతం పూర్తిగా కోలుకుని, ఆరోగ్యంగా ఉండటంతో ఆసుపత్రి నుంచి వీరిని డిశ్చార్జీ కూడ చేశామని పేర్కొన్నారు. ఆపరేషన్ల తర్వాత వ్యాక్సిన్లు, మందులకు పేషంట్లకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ఆరోగ్యశ్రీ కింద ఖర్చులను ప్రభుత్వమే భరించిందని ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ లు ప్రొ. ఎస్.రాజేశ్వర్ రావు, ప్రొ. శోభన్ బాబు లు తెలిపారు.

## ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో

# ఘనంగా భోగి, సంక్రాంతి వేడుకలు

**హనుమకొండ జనవరి 14 (ప్రజామంటలు):** మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా అయినవోలు మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున దేవాలయంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, వరంగల్ ఎంపీ దయాకర్, హనుమకొండ జడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ సుధీర్ కుమార్, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, డిసిబి చైర్మన్ మారినేని రవీందర్ రావు తదితరులు శ్రీ మల్లికార్జున స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేశ్వరరావు ఆహుతులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సంతోషంగా ఉండాలని ఈ పండుగ అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆ మల్లికార్జున స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మల్లికార్జున స్వామి పట్నాలు ప్రభన్లు ఊరేగింపులతో ఆలయ ప్రాంగణమంతా మల్లికార్జున స్వామి నామ స్మరణలతో మారుమోగాయి. ఆలయ ప్రాంగణంలో వైద్య ఆరోగ్యశాఖ ఎక్సైజ్ మహిళా శిశు సంక్షేమ శాఖ టూరిజం తదితర శాఖలో నుండి సేవా కార్యక్రమాలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ




కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు ఆలయ సిబ్బంది నూతనంగా ఎన్నిక కాబడిన అయినవోలు మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

# అన్నమాచార్య కళామందిరంలో వైభవంగా శ్రీ గోదాకల్యాణం


**తిరుమల జనవరి 14 (ప్రజామంటలు):** పవిత్ర ధనుర్మాసం ముగింపు సందర్భంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శనివారం శ్రీ గోదా కల్యాణం వైభవంగా జరిగింది. ధనుర్మాసంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గల 250 కేంద్రాల్లో నెల రోజుల పాటు ప్రముఖ పండితులతో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. ముందుగా శ్రీ గోదాదేవి(ఆండాళ్), శ్రీరంగనాథస్వామివారి ఉత్సవర్లను వేదికపై ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టం నిర్వహించారు. వేద పారాయణదారుల వేద పఠనం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గాత్ర సంగీతం, నృత్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది.

అన్నమాచార్య కళామందిరంలో ముగిసిన తిరుప్పావై ప్రవచనాలు

టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో డిసెంబరు 17 నుంచి దాదాపు నెల



రోజుల పాటు జరిగిన తిరుప్పావై ప్రవచనాలు శనివారం ముగిశాయి. తిరుపతికి చెందిన ప్రముఖ పండితులు చక్రవర్తి రంగనాథన్ తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు



## ఫస్ట్ టైం సొంత జిల్లాలో

# బాబు రికార్డు మోత....?

తెలుగుదేశం అధినేత చంద్రబాబుది నాలుగున్నర పదుల రాజకీయ జీవితం. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేగా మంత్రిగా ముఖ్యమంత్రిగా ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనిచేశారు. 1978లో ఎలా ఉన్నారో ఎంత ఎనెర్జిటిక్ గా ఉన్నారో ఇపుడు కూడా అలాగే బాబు ఉండడం విశేషం. తన కొడుకు సమానుడు అయిన జగన్ తో సై అంటున్న చంద్రబాబుకు ఇన్నాళ్ళూ మైనస్ అయిన ఒక కీలక ప్రాంతం ఇపుడు కలసివస్తుందా అన్న చర్చ అయితే రాజకీయ వర్గాలలో సాగుతోంది. రాయలసీమకు ఎన్టీయార్ ని దత్తపుత్రుడు అనేవారు. ఆయన సినిమాల్లో హీరోగా ఎంట్రీ ఇచ్చిన తరువాత నుంచి సీమ మీద ప్రత్యేక శ్రద్ధతో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. రాయలసీమ క్షామనిధిని విరాళాలు భారీగా అందిస్తూ ఆయన సీమ జనానికి దత్తపుత్రుడు అయిపోయారు. ఆయనకు ఆ కాలం లీడర్స్ అయిన కోట్ల విజయభాస్కరరెడ్డి వంటి వారితో ఎంతో అనుబంధం ఉండేది. ఇక సినిమాల్లో కూడా ఎన్టీయార్ పోషించే పౌరుషవంతమైన పాత్రలను సీమ జనాలే కాదు రాజకీయ నేతలు సైతం ఇష్టపడేవారు. అలా ఎన్టీయార్ కి సీమలో సినిమా హీరోగా విశేష ఆదరణ ఉంది. అదే బాలయ్యకు కూడా తరువాత కాలంలో టర్న్ అయింది. ఎన్టీయార్ రాజకీయ రంగ ప్రవేశం చేశాక సీమ ప్రాంతాలు అన్నీ ఆయనకు వెన్నుదన్నుగా ఉంటూ వచ్చేవి. ఎన్టీయార్ వెంటే మేము అని మొత్తం ప్రాంతం జై కొట్టేది. ఎపుడైతే ఎన్టీయార్ దివంగతులు అయ్యారో నాటి నుంచే సీమలో తెలుగుదేశానికి ఆదరణ తగ్గడం మొదలైంది. దానికి కారణం ఎన్టీయార్ అంటే విపరీతమైన ఆరాధనాభావం ఉన్న సీమ జనాలు ఆయన వెన్నుపోటు ఎపిసోడ్ ని జీర్ణించుకోలేకపోయారు. దాంతో సీమకే చెందిన చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం ముందుకు సాగినా అది ఫక్తు కోస్తా పార్టీగానే అయిపోయింది. సీమలో అనంతపురంలో కొంత తెలుగుదేశానికి లోకల్ లీడర్స్ వల్ల ఆదరణ ఉంది కానీ కడప కర్నూల్ చిత్తూరులలో ఎపుడూ మెజారిటీ సీట్లు తెలుగుదేశం తెచ్చుకున్నది లేదు. కానీ ఈసారి అలా కాదు అని తెలుగుదేశం నేతలే అంటున్నారు. ఈసారి జగన్ సొంత జిల్లా కడప నుంచే తెలుగుదేశం ప్రభంజనం స్టార్ట్ అవుతుంది అని అంటున్నారు. అలాగే చంద్రబాబు మూడుసార్లు ఏపీకి సీఎం అయినా ఆయన సొంత జిల్లా చిత్తూరులో మాత్రం అప్పట్లో కాంగ్రెస్ ఇపుడు వైసీపీదే పై చేయిగా ఉంది. 2019 ఎన్నికల్లో అయితే ఒక్క చంద్రబాబు తప్ప అన్ని సీట్లను వైసీపీ గెలుచుకుంది. కానీ 2024లో మాత్రం మొత్తం పొలిటికల్ సీన్ మారిపోతుంది అని తెలుగుదేశం నాయకులు అంటున్నారు. చంద్రబాబు కూడా గట్టి పట్టుదలతో ఉన్నారు. సీమ నుంచే చక్రం తిప్పాలనుకుంటున్నారు. అందుకే తన కుమారుడు లోకేష్ పాదయాత్రను చిత్తూరు జిల్లా కుప్పం నుంచి మొదలుపెట్టిస్తున్నారు. ఇక చూస్తే జగన్ చంద్రబాబులలో ఎవరు కావాలీ అంటే ఇప్పటిదాక జగన్ కే ఓటేశారు జనం. కానీ జగన్ సీఎం అయ్యాక సీమకు ప్రత్యేకంగా ఒరిగింది లేదు అన్న అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇక సీమలో బడా నాయకులు అంతా కూడా ఇపుడు ఒక్క చోట చేరి యాంటీ వైసీపీ స్టాండ్ తీసుకుంటున్నారు. వారి డైరెక్ట్ గా ఇండైరెక్ట్ గా తెలుగుదేశానికి సాయం చేయబోతున్నారు. ఫస్ట్ టైం బాబాయ్ వివేకానందరెడ్డి లేకుండా జగన్ కడప జిల్లా ఎన్నికలను ఫేస్ చేయబోతున్నారు. అది కూడా ఇబ్బందిగా మారుతోంది అంటున్నారు. ఇంకో వైపు తెలుగుదేశానికి సహజంగానే బలిజల మద్దతు ఉంది. ఇపుడు జనసేనతో పొత్తులు ఉంటే సాలిడ్ గా ఆ సామాజికవర్గం ఈ వైపు టర్న్ అయితే కడప రాజకీయాల్లోనే తేడాలు వస్తాయని అంటున్నారు. దాంతోనే చంద్రబాబు ధీమాగా మాట్లాడుతున్నారు. ఆయన ఈసారి చిత్తూరు జిల్లాలో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు లో ఎలా గెలుస్తారో చూస్తానంటూ భారీ సవాల్ విసిరారు. పుంగనూరు లో తనకు ఎదురులేకుండా కంచుకోట కట్టుకున్న పెద్దిరెడ్డికే చుక్కలు చూపించేలా బాబు వ్యూహం ఉంటే ఇక నగరిలో రోజా పరిస్థితి ఎలా అన్నదే చర్చ. దీంతో పాటు తిరుపతి సహా ఇతర సీట్ల విషయంలోనూ తెలుగుదేశం పొత్తులతో ఆధిక్యత సాధిస్తుందని అంటున్నారు. అదే జరిగితే ఫస్ట్ టైం చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం సొంత జిల్లాలో జెండా ఎగరేసినట్లు అవుతుంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే చంద్రబాబుకు సొంత జిల్లా చిత్తూరులో ఎపుడూ పట్టు లేదని గతంలో కాంగ్రెస్ ఇపుడు వైసీపీ ఇక్కడ ఎక్కువ సీట్లు గెలుచుకుంటూ వస్తున్నాయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అంటున్నారు. చంద్రబాబుది ఏడుపుగొట్టు రాజకీయమని ఆయన లైట్ తీసుకుంటున్నారు. కానీ గ్రౌండ్ లెవెల్ లో అలాంటి పరిస్థితి ఉందా అన్నదే పెద్దిరెడ్డి ఒకసారి చెక్ చేసుకోవాలని అంటున్నారు

# ఏపీలో జోరుగా కోడిపందేలు ప్రారంభం

**అమరావతి, జనవరి 14 (ప్రజామంటలు):** ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి . మూడు రోజుల పాటు నిర్వహించుకునే పండుగ తొలిరోజు శనివారం తెల్లవారుజాము నుంచే తమ ఇళ్ల ఎదుట భోగి మంటలు వేసి జరుపుకున్నారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భోగి మంటల



చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. మరోవైపు కోట్లాది రూపాయలు చేతులు మారే కోడి పందేలు సైతం పలు జిల్లాల్లో ప్రారంభమయ్యాయి. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేయగా శనివారం ఉదయం పందేలను తిలకించడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ,ఏలూరి జిల్లాలో కోడి పందేలు ప్రారంభమయ్యాయి. కృష్ణా జిల్లా గన్నవరం, గుడివాడ, కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జార్జిపేటలో,కాకినాడ నగరం, జగ్గంపేట, పెద్దాపురం,పిఠాపురపం, గొల్లప్రోలు, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ,నిడదవోలు, గోపాలపురం, ఉండ్రాజవరం, పెరవలి, నంద్యాల తదితర మండలాల్లోనూ పందేలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ కోడి పందేలను తిలకించడానికి , కర్నాటక, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి ఇప్పటికే పలువురు ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. భీమవరం, ఉండి ప్రాంతాల్లో కొన్ని బరుల వద్ద మహిళల కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు

# ఆదిపురుష్ మూవీని వదలని వివాదాలు



ప్రభాస్ ఆదిపురుష్ సినిమా మరో వివాదంలో ఇరుక్కుంది. ఆదిపురుష్ మూవీకి వ్యతిరేకంగా దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా సెన్సార్ బోర్డ్‌కు అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ నోటీసులు జారీ చేసింది. పిటిషన్ పై స్పందించాల్సిందిగా కోరింది. సెన్సార్ బోర్డ్ నుంచి సర్టిఫికెట్

## సెన్సా కాకుండానే టీజర్ విడుదలపై కేసు

పొందకుండానే ఆదిపురుష్ చిత్ర నిర్మాతలు ఆదిపురుష్ సినిమా టీజర్‌ను విడుదల చేశారని కుల్దీప్ తివారీ పిటిషన్ దాఖలు చేశారు. టీజర్ లో సీత పాత్రలో కృతి సనన్ వేసుకున్న కాస్ట్యూమ్స్‌పై పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశారు. రాముడు, సీత దేవతలనే ప్రజలకు విశ్వాసం ఉందని.. అయితే టీజర్ లో ప్రజల విశ్వాసానికి వ్యతిరేకంగా చూపించారని పేర్కొన్నారు. దీంతో పాటు రావణుడి సన్నివేశంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సినిమాలో దేవుడి పాత్రలో నటిస్తున్న నటులు ప్రభాస్, కృతి సనన్, సైఫ్ అలీఖాన్, దేవదత్ నాగే, సన్నీ సింగ్‌లను కూడా ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌లో నిర్మాతలు, దర్శకులు ఓం రౌత్‌లు కూడా ప్రతివాదులుగా ఉన్నారు. దీంతో ఈ పిటిషన్‌ను స్వీకరించిన అలహాబాద్ హై కోర్ట్..సెన్సార్ బోర్డుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది.ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి వివాదంలో చిక్కుకుంది. టీజర్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా సన్నివేశాలు ఉన్నాయని ఆరోపించారు. మరికొందరైతే టీజర్ బాలేదని.. యానిమేషన్ మూవీలా ఉందంటూ విమర్శించారు. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తొలి మైథలాజికల్ మూవీ 'ఆది పురుష్ ని ఆది నుంచి వివాదాలు చుట్టుముడుతున్నాయి. ఈమూవీ టీజర్ ని ఇటీవల విడుదల చేయడం సినిమాలోని పాత్రలని డిజైన్ చేసిన తీరుపై దేశ వ్యాప్తంగా విమర్శలు వెల్లు వెత్తాయి. శ్రీరాముడిగా ప్రభాస్ మేకోవర్ రావణ బ్రహ్మగా సైఫ్ అలీఖాన్ ని చూపించిన తీరు.. సీత పాత్రలో కృతి సనన్ ప్రభాస్ ల మధ్య వచ్చే సన్నివేశాలు..సినిమాలోని కొన్ని సన్నిఏవశాల్లో హనుమంతుడి క్యారెక్టర్ మేకోవర్.. ఇలా ప్రతీ విషయంలోనూ సినిమాపై విమర్శలు వెల్లు వెత్తడంతో సినిమా వివాదాస్పదంగా మారింది. దీంతో నష్టనివారణ చర్యలకు పూనుకున్న చిత్ర బృందం గ్రాఫిక్స్ వర్క్ కోసం మరో 100 కోట్లు కేటాయించి రీ వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన గ్రాఫిక్స్ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో ఈ మూవీ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ మూవీకి సంబంధించిన టీజర్ ని ఎలాంటి సెన్సార్ లేకుండా ప్రదర్శించారని కుల్దీప్ అనే వ్యక్తి కోర్టుని ఆశ్రయింయడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. 'ఆది పురుష్' టీజర్ పై అలహాబాద్ కోర్టుతో కుల్దీప్ అనే వ్యక్తి కేసు వేశాడు. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది.



# హాలీవుడ్ దర్శకుడు స్పీల్‌బర్గ్‌ను కలిసిన రాజమౌళి

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పిల్‌బర్గ్‌ను దర్శక ధీరుడు రాజమౌళి కలిశారు. ఈ సమయంలో ఆయనతో దిగిన ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. ఈ ఫొటోల్లో ఒకదాంట్లో.. రాజమౌళి తన రెండు చేతులను చెంపలకు అడ్డంగా పెట్టుకొని, చిన్న పిల్లల మనస్తత్వాన్ని ప్రదర్శించగా... మరో ఫొటోలో ఇటీవల గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకున్న మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి, స్టీవెన్ స్పిల్ బర్గ్ తో రాజమౌళి ఫ్రేమ్‌ను పంచుకున్నారు. దాంతో పాటు ఇప్పుడే దేవుడిని కలిశాననే క్యాప్షన్ ను, లవ్ సింబల్స్, జోడించారు. దీంతో ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ పోస్టుపై నెటిజన్లు పలురకాల కామెంట్లు చేస్తున్నారు. సినిమా మీట్స్ సినిమా అని ఒకరంటే.. మీరిద్దరూ మా బాల్యాన్ని గుర్తుకుతెచ్చిన లెజెండ్స్ అని మరొకరు కామెంట్ చేశారు. రాజమౌళి దర్శకత్వం వహించిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు గానూ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి గో÷–డలెన్ గ్లోబ్ అవార్డు అందుకున్నారు. దాంతో ఆర్‌ఆర్‌ఆర్ టీమ్ పై అందరూ ప్రశంసలు గుప్పించారు. దాంతో రాజమౌళి ట్విట్టర్ వేదికగా అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సంగీతానికి హద్దులుండవని, నాటు నాటు పాటను అందించినందుకు కీరవాణికి అభినందనలు తెలియజేశారు. కాగా గాడ్ అఫ్ మూవీస్‌గా అభివర్ణించే స్పిల్‌బర్గ్.. 'జురాసిక్ పార్క్', 'హుక్', 'ది టర్మినల్', 'ది పోస్ట్' వంటి గొప్ప చిత్రాలకు స్పిల్‌బర్గ్ దర్శకత్వం వహించారు.

# గోల్డెన్ గ్లోబ్‌అవార్డు గర్వకారణం

### ఆర్‌ఆర్‌ఆర్ టీమ్‌కు ప్రియాంక అభినందనలు



గోల్డెన్ గ్లోబ్ 2023లో ఇండియన్ సినిమాకి అద్భుతమైన విజయాన్ని అందించిన రాజమౌళిని టీమ్ ను గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా అభినందించారు. అమితాబ్ బచ్చన్- షారూక్ ఖాన్-అమీర్ ఖాన్- చిరంజీవి సహా పలువురి అభినందనల తర్వాత గ్లోబల్ స్టార్ పీసీ నుంచి ప్రశంస దక్కింది. ఈవెంట్ లో అవార్డులను గెలుచుకున్న వీడియోను షేర్ చేసిన ప్రాయాంక ఆర్.ఆర్.ఆర్ టీమ్ కు అభినందనలు తెలిపారు. గ్లోబల్ ఐకాన్ గా పాపులరైన ప్రియాంక చోప్రా హాలీవుడ్‌లో నటిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్ డమ్‌ని ఆస్వాదిస్తోంది. ఇలాంటి సమయంలో రాజమౌళికి మరింత గుర్తింపు దక్కాలన్నా మార్కెట్ మాయాజాలాన్ని విస్తరించాలన్నా ప్రియాంక చోప్రా లాంటి గ్లోబల్ స్టార్ తో కలిసి మల్టీస్టారర్లు తెరకెక్కిస్తే అది అడ్వాంటేజ్ అవుతుందని ట్రేడ్ విశ్లేషిస్తోంది. రాజమౌళితో సినిమాచేసేందుకు ప్రియాంక చోప్రా సైతం ఆసక్తిగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

### కలెక్షన్లలో దుమ్ము రేపుతున్న

# వీరసింహారెడ్డి

నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కిన వీరసింహారెడ్డి సినిమాకు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ నెల 12న విడుదలైన ఈ మూవీ చూసేందుకు



అభిమానులు థియేటర్లకి క్యూ కడుతున్నారు. కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న ఈ సినిమా రికార్డులను తిరగరాస్తోంది. సినిమా విడుదలైన మొదటిరోజునే ప్రపంచవ్యాప్తంగా రూ.54 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. తెలుగు రాష్ట్రాల్లో రూ.25.36 కోట్లు వచ్చాయి. దీంతో అత్యధిక వసూళ్లు రాబట్టిన 15వ సినిమాగా వీరసింహారెడ్డి నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డ్ పుష్ప సినిమాపై ఉంది. పుష్ప మూవీ తెలుగు రాష్టాల్లో్ర ఒక్కరోజులో రూ.24.90కోట్లు రాబట్టగా, ఆ రికార్డ్ ను వీరసింహారెడ్డి తిరగరాసింది. రూ.25.36 కోట్లు వసూలు చేసింది. వసూళ్లపరంగా చూస్తే ఆర్‌ఆర్‌ఆర్ సినిమా మొదటిస్థానంలో ఉంది. రూ.74.11 కోట్ల వసూళ్లతో ఆ సినిమా ఫస్ట్ ప్లేస్ లో, కేజీఎఫ్ రెండో స్థానంలో నిలిచింది.

# పాత కథకు మళ్లీ మెరుగులు

## దిల్‌రాజ్ స్టేటస్‌కు తగని వారసుడు



దిల్‌రాజ్ వారసుడు శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విజయ్ ఒక పెద్ద వ్యాపార కుటుంబానికి చెందిన కుర్రాడు. ఆ కుటుంబంలో చివరి సంతానమైన విజయ్.. తండ్రి చేతిలో కీలుబొమ్మలా ఉంటూ వ్యాపార సామ్రాజ్యానికి వారసుడు కావడం కంటే సొంత కాళ్లపై నిలబడాలనుకుంటాడు. తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగా నడుచుకోవడం వల్ల ఇల్లు వదిలి వెళ్లిపోతాడు. సొంతంగా ఒక స్టార్టప్ కంపెనీ పెట్టే ప్రయత్నంలో ఉన్న అతను.. తల్లి కోరిక మేరకు తండ్రి షష్టి పూర్తి వేడుకల కోసం చాలా ఏళ్ల తర్వాత ఇంటికి వస్తాడు. క్యాన్సర్ బారిన పడ్డ అతడి తండ్రి ఆ విషయం ఎవరికీ చెప్పకుండా దాచి పెట్టి తన మొదటి ఇద్దరు కొడుకుల్లో ఎవరిని వారసుడిని చేయాలనే ఆలోచనలో ఉంటాడు. కానీ వాళ్లిద్దరూ తండ్రికి తెలియకుండా చేసిన తప్పులు బయటపడతాయి. అదే సమయంలో వ్యాపారంలో ఆ కుటుంబానికి ఎదురు దెబ్బలు తగులుతాయి. ఈ సమస్యలన్నీ పరిష్కరించి తండ్రికి తనే వారసుడినని విజయ్ రుజువు చేసుకున్నాడు. తెలుగు స్టార్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి.. తెలుగు అగ్ర నిర్మాత దిల్ రాజు కలిసి.. తమిళంలో ప్రస్తుతం నంబర్ వన్ హీరోగా కొనసాగుతున్న విజయ్‌ని మెప్పించి ఓ సినిమా చేస్తున్నారంటే అంత విశేషం ఏముందో ఆ కథలో అనుకున్నారు.మన రైటర్లు.. డైరెక్టర్లు అరగతీసేసిన ఫార్ములాను పట్టుకుని.. కమర్షియల్ హంగులు అద్ది వంశీ వడ్డించిన కిచిడీ వంటకమే 'వారసుడు'.హీరో తండ్రి తన మాట వింటూ ప్రయోజకులుగా మారిన ఇద్దరు కొడుకులను చూసి ప్రౌడ్ ఫీలవుతూ.. తన అభీష్టానికి భిన్నంగా ఉన్న కొడుకును వెళ్లగొడితే.. ఆ కుటుంబం కష్టాల్లో ఉంటే బయటికి వెళ్లిన ఆ కొడుకే సమస్యలన్నీ తీర్చి తన తండ్రి గర్వించేలా చేయడం.. స్థూలంగా 'వారసుడు' కథ. 17 ఏళ్ల ముందు తెలుగులో వచ్చిన 'గౌతమ్ ఎస్ఎస్సీ' అచ్చంగా ఇదే లైన్లో సాగే సినిమా. అందులో హీరో తండ్రికి తెలియకుండా సమస్యల్ని పరిష్కరిస్తే.. ఇందులో తండ్రి కోరిక మేరకు కుటుంబాన్ని ఆదుకుంటాడు. అంతే తేడా. కథ వరకు 'గౌతమ్ ఎస్-ఎస్సీ'ని గుర్తు చేసే 'వారసుడు'.. కథనం.. సన్నివేశాల విషయంలో మరెన్నో సినిమాలను గుర్తుకు తెస్తుంది. ప్రకాష్ రాజ్ విలనీ ఏమాత్రం కిక్కు ఇవ్వదు. ఒకదాని తర్వాత ఒకటి హీరో సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకెళ్లిపోతాడు. హీరో అన్న కూతురి కిడ్నాప్ వ్యవహారంతో కొంచెం సెంటిమెంటును పండించే ప్రయత్నం చేశారు. విజయ్ హీరోయిజాన్ని ఎంజాయ్ చేయగలిగిన వాళ్లు.. కొంతమేర ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాతో కనెక్ట్ కావచ్చు కానీ.. అంతకుమించి 'వారసుడు'లో చెప్పుకోవడానికి ఏమీ లేదు.





PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com